నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి

గురువారం | అక్టోబర్ 10, 2024 | www.navatelangana.com

దొంగలించబోయి దొరికిన దుండగులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని పోచారం గ్రామంలో బుధవారం తెల్లవారుజామున బైకులు దొంగలించబోయి దుండగులు దొరికిపోయారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మాల్‌తుమ్మెద గ్రామానికి చెందిన చాకలికుమార్, గుడ్డి వెలుగుల కిరణ్ కుమార్, కడాయి కుమార్ లు ముగ్గురు కలిసి పోచారం గ్రామంలో బైకులు దొంగలించడానికి పన్నాగం పన్నారు. రెండు బైకులు దొంగలించి మూడో బైక్ దొంగలించే సమయానికి గ్రామస్తుల చేతిలో దొరికిపోయారు. గ్రామస్తులు పట్టుకొని చితకబాదగా గ్రామంలో రెండు బైకులు దొంగలించిన విషయం వెలుగుజూసింది. దుండగులను పోలీస్ స్టేషన్లో అప్పగించారు. గ్రామానికి చెందిన లక్ష్మణ్ గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్టు ఏఎస్ఐ ఉమేశ్ తెలిపారు.

డెంగ్యూతో విద్యార్థి మృతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డెంగ్యూతో విద్యార్థి మృతిచెందిన ఘటన నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలంలోని రాంపూర్ (డి) గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వెంకనోళ్ల లత, రాజేందర్‌ల కుమారుడు వెంకనోళ్ల ఓంకార్ (22) హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతున్నాడు. ఇటీవల గ్రామానికి వచ్చి హైదరాబాద్‌కు వెళ్లాడు. జ్వరం రావడంతో తిరిగి ఇంటికి వచ్చారు. జ్వరం తగ్గకపోవడంతో సోమవారం ఉదయం నిజామాబాద్‌లోని ప్రైవేటు హాస్పిటాల్లో చికిత్స చేయించారు. రక్తపరీక్షలు చేయించగా ప్లేట్లెట్స్ తగ్గినాయని, హైదరాబాద్ తీసుకెళ్లాలని డాక్టర్ సూచించడంతో ఆదే రోజు రాత్రి హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. చికిత్స పొందుతూ ఓంకార్ బుధవారం మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆర్మీలో చేరడానికి కోచింగ్ సైతం పూర్తి చేసుకున్నట్లు వారు తెలిపారు. గ్రామంలో అందరితో కలిసి మెలిసి ఉండే ఓంకార్ మృతి చెందడంతో కుటుంబంలో, గ్రామంలో దసరా పండగ కంటే ముందే విషాద ఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు స్థానికులను కలిచివేశాయి.

చుట్టు పచ్చని అడవి. ఆహ్లాదకరమైన అటవీ ప్రాంతంలో మేకలు మేత మేస్తున్నాయని భావిస్తే మీరు పప్పులో కాలేసినట్టే. మేకల్లో కృత్రిమ 'రాళ్లు' పెంచేందుకు నవీపేట్‌లో ఓ మాఫియా వాటికి ఆపరేషన్ చేసి అవి ఎక్కడికీ వెళ్లకుండా వాటికి మేత తీసుకొచ్చి వేస్తున్నారు. ఇందుకోసం అటవీ ప్రాంతంలో ప్రత్యేకంగా గుడారాలు ఏర్పాటు చేశారు. కాగా వాటికి కెమికల్ ఇంజక్షన్స్ ఇస్తూ వాటిని దసరా వేళ విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు.



ఆపరేషన్ 'గోట్'

నవీపేట్‌లో మేకల మాఫియా!

- గుట్టుగా మేకలలో కృత్రిమ రాళ్ల పెంపకం
- అటవీప్రాంతంలో వాటికి ఆపరేషన్ చేస్తూ వరాల పేగులో తుమ్మ గింజల అమరిక
- విదేశాలకు స్మగ్లర్లతో ఔషధ రాళ్ల తరలింపు
- కెమికల్ ఇంజక్షన్లు ఇస్తున్న వైనం!
- దసరా పండుగకు విక్రయించేందుకు సిద్ధం
- చౌక ధరకు మాంసం విక్రయం
- మాంస ప్రియులకు అనారోగ్య సమస్యలు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

నవతెలంగాణ-నవీపేట్

నవీపేట్ మండలంలో అటవీ ప్రాంతంలో కొందరు ధనార్జన ధ్యేయంగా గుడారాలు వేసుకొని గుట్టుచప్పుడు కాకుండా మేకలలో కృత్రిమ రాళ్ల తయారీ చేస్తూ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. సాధు జంతువులను వైల్డ్ లైఫ్ సాంచరీలోకి తీసుకు వెళ్లొద్దని నిబంధనలు ఉన్నా అవేమి పట్టకుండా మేకల రాళ్ల వ్యాపారులు డేరాలు వేసుకొని తమ దందాను జోరుగా కొనసాగిస్తున్నారు. మేకలకు ఆపరేషన్ చేస్తూ వాటి పేగుల్లో తుమ్మ గింజలు అమరిస్తూ కెమికల్ ఇన్‌జక్షన్‌లు ఇస్తున్నారు. ప్రస్తుతం దసరా వేళ.. ఆ మేకలను చౌకధరకు విక్రయిస్తూ వారే కోసి ఇస్తూ రాళ్లను సొంతం చేసుకుంటున్నారు. కాగా కెమికల్ ఇన్‌జక్షన్‌లు ఇవ్వడంతో ఆ మాంసం తినే వారికి అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఇంత తంతు జరుగుతున్నా.. అధికార యంత్రాంగం మాత్రం అవేమి పట్టనట్టు చోద్యం చూస్తూ ఉండిపోతుంది.

మేకలలో రాళ్లు ఏంటి అనుకుంటున్నారా?

అడవి ప్రాంతంలో లభించే కొన్ని రకాల చెట్ల ఆకుల రసానికి మేకలు తినే తుమ్మ గింజలు రసాయన ముద్దలు (రాళ్లు)గా తయారు అవుతాయి. ఇవి సహజ సిద్ధంగా తయారు కావడంతో ఔషధ గుణాలు కలిగి ఉండడంతో ఇతర దేశాల్లో వీటికి డిమాండ్ ఎక్కువ. తులానికి (10 గ్రాములకు) రూ.20 వేల నుండి 30 వేలకు ధర పలకుతాయి. ఇంతవరకు బాగానే ఉన్నా కొందరు ధనార్జనే ధ్యేయంగా మేకలలో కృత్రిమ రాళ్లు తయారుచేసి కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారు.



కొట్టాంలో ఆపరేషన్ అయిన మేక..



ఆపరేషన్ చేసిన మేకకు అక్కడే దాన

మేకల వరాల పేగులో ఆపరేషన్ తో తుమ్మ గింజల అమరిక..

సహజ సిద్ధంగా తయారయ్యే రాళ్లు మేకలు విసర్జించే క్రమంలో బయటకు వెళ్లిపోతాయి. అలా కాకుండా మేకలలో రాళ్ల తయారీకి కేటుగాళ్లు కొత్త పుంతలు తొక్కుతున్నారు. తుమ్మ గింజలను ఒక ప్లాస్టిక్ వైర్‌కు పూసలాగా గుచ్చి మేకకు కెమికల్ ఇంజక్షన్ మత్తుమందు ఇచ్చి పొట్ట కింది భాగంలో ఆపరేషన్ చేసి జీర్ణాశయంలోని వరాల పేగులో అమరుస్తున్నారు. దీంతో మేక విసర్జించినా రాళ్లు బయటకు వెళ్లవు. దీనికోసం వ్యాపారస్తులు మేకలను కొనుగోలు చేసి వాటి కడుపు భాగంలో పశు వుల వైద్యులతో మత్తుమందు ఇచ్చి ఆపరేషన్ చేస్తున్నారు. మేకలను అటవీ ప్రాంతంలోనే 15 నుంచి నెల రోజుల పాటు గుడారాల వద్ద ఉంచి వాటికి పంచోత్రి, జిలుగుడు, కొరిష్యా విషపూరిత చెట్ల ఆకులను బలవంతంగా తినిపిస్తున్నారు. ఇలా మూడు నెలల పాటు అటవీ ప్రాంతంలో మేకలను పెంచుతున్నారు. కొన్నిసార్లు మేకల పొట్ట భాగం కుళ్లి చనిపోవడంతో వాటి మాంసాన్ని సైతం విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

కోట్లాదిరూపాయల వ్యాపారం

కేటుగాళ్లు ధనార్జనే ధ్యేయంగా గుట్టుచప్పుడు కాకుండా అటవీ ప్రాంతంలో 20 లక్షల పెట్టుబడితో ఒక్కో షిఫ్టులో 100 మేకలకు ఈ విధంగా ఆపరేషన్‌లు చేస్తూ కృత్రిమ రాళ్లను సృష్టిస్తూవిక్రయిస్తూ కోట్లాదిరూపాయలు ఆర్జిస్తున్నారు. ఒక్కో మేకకు 50 వేల నుండి లక్ష రూపాయలు వస్తుండటంతో కోట్లాదిరూపాయల ఆదాయం సంపాదిస్తున్నారు. మేకల నుండి వచ్చిన రాళ్ల కొనుగోలు భారత దేశంలో నిషేధించడంతో విదేశాలకు స్మగ్లర్ల ద్వారా తరలిస్తున్నట్లు సమాచారం. మేకలను హింసిస్తూ బలవంతంగా మత్తు మందు కోసం కెమికల్ ఇంజక్షన్‌లతో పాటు క్యాల్షియం ఇంజక్షన్లను హెవీ డోసులుగా ఇవ్వడంతో మాంసం విషపూరితంగా మారుతుంది. ఈ తంతు గత కొంతకాలంగా మండలంలో కొనసాగుతున్నా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

విషపూరిత మాంసంతో రోగాలు..

రాళ్ల పెంపకం అత్యాశతో మేకల మాఫియా స్టెరాయిడ్ లాంటి ఇంజక్షన్లను ఇస్తుండటంతో మాంసం విషపూరితంగా మారుతుంది. ఈ మాంసాన్ని తిన్న పురుషుల వక్షోజాలు, మహిళలు అబార్షన్ లాంటి సమస్యలతో బాధపడతారని వైద్యులు సూచిస్తున్నారు. కాగా దసరా పండుగ సందర్భంగా మేకలు విక్రయించేందుకు సిద్ధం చేసినట్టు సమాచారం. కొనుగోలు చేసిన వారితో తామే వాటిని కోస్తామని ముందస్తు ఒప్పందం చేసుకొని విక్రయిస్తూ వాటిలో నుంచి రాళ్లను తీసుకుంటున్నారు. అటు జీవాలతో పాటు ఇటు ప్రజల ఆరోగ్యంతో చలగాటమాడుతున్న మాఫియాపై జిల్లా అధికారం యంత్రాంగం స్పందించి మండలంలో మేకలలో రాళ్ల తయారీని అడ్డుకొని చట్టరీత్యా చర్యలు తీసుకొని అడ్డుకట్ట వేయాలని జంతు ప్రేమికులు, ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

పండుగ వేళ.. జేబు ఖాళీ

- మల్టీపర్పస్ వర్కర్‌లకు ఇంకా అందని పెండింగ్ వేతనాలు
- ప్రభుత్వం రిలీజ్ చేసినా.. ఎస్టీవోలో ఆగిన చెక్కులు
- నేడు బ్యాంకులో వేస్తేనే రేపు చేతికొచ్చే అవకాశం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



పండగలలో పెద్ద పండగ దసరా. ఈ పండుగ కోసం ప్రభుత్వం మల్టీపర్పస్ వర్కర్లకు జీతాలు చెల్లించాలని నిధులు విడుదల చేసిన జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం సాయంత్రం వరకు వేతనాలు పడక లబోదిబో మొత్తుకుంటున్నారు. మండలంలో ఆయా గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు ఐదో తేదీనే ప్రభుత్వం ఫైనాన్స్ గ్రాంట్‌ను ఆయా గ్రామపంచాయతీలకు విడుదల చేసింది. ఆ నిధుల నుండి ఇతర అవసరాలకు వాడకుండా ముందస్తుగా గ్రామపంచాయతీలలో పనులు చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు మాత్రమే రెండు నెలల నుండి మొదలుకొని నాలుగైదు నెలల వరకు వేతనాలు చెల్లించాలని స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. దానిలో భాగంగానే మండల కేంద్రాల నుండి 5వ తేదీన వేతనాల కోసం చెక్కులను సిద్ధం చేసి ఎస్టీవోకు పంపించిన నేటి వరకు వేతనాలు వర్కర్ల ఖాతాల్లో జమ కాలేదు. ముందే అరకొర వేతనం.. చాలీచాలని డబ్బులతో కుటుంబాన్ని నెట్టుకొస్తుండగా.. పెద్దపండుగ అయిన దసరాకు డబ్బులు లేక జేబులు ఖాళీగా మారాయి. గత ఐదారు నెలలుగా వేతనాలు రాక పోవడంతో దసరాకైనా వస్తే తమ పిల్ల పాపలతో నూతన వస్త్రాలను కొనుగోలు చేసి పండుగ చేసుకుందామని భావిస్తే భంగపాటుకు గురి చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనునిత్యం కారోబారు నుంచి మొదలుకొని మండల పరిషత్ అభివృద్ధి అధికారి వరకు మొరపెట్టుకుంటున్న ఇదిగో నేడు రేపు అనుకుంటా కాలం వెళ్లదీస్తున్నారని, పండుగ దగ్గరికి వచ్చినా ఇప్పటికీ వేతనాలు తమ చేతికి అందకపోవడంతో దిక్కుతోచక కొట్టుమిట్టా డుతున్నామని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం నుండి నిధులు విడుదలై మండల కేంద్రాల నుండి అన్ని సిద్ధం చేసి ఎస్టిఓలో జమ చేసిన చెక్కులు ఇప్పటికీ క్లియర్ కాకపోవడంలో ఆంతర్యం ఏమిటీ అర్థం కావడం లేదు. ప్రతి గ్రామపంచాయతీలో ముగ్గురు నుండి మొదలుకొని 10 నుండి 15 మంది వరకు మల్టీపర్ప వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 29 మండలాలకు గాను ఒక్కో మండలంలో 100 మందికి మించి వర్కర్‌లు విధులు నిర్వర్తిస్తున్నారు.

షాపింగ్‌కు ఒక్కరోజే అవకాశం

పండుగకు ఇంకా మిగిలింది రెండు రోజులే. నేడు గురువారం 10వ తేదీన బ్యాంకు ఖాతాల్లో చెక్కులు వేసినా శుక్రవారం 11వ తేదీనా ఒకే ఒక రోజు మిగిలి ఉంటుంది. శనివారం దసరా నేపథ్యంలో బ్యాంకులకు సెలవు. ఇంకా ఎప్పుడు వెళ్లి తాము నూతన వస్త్రాలు, ఇతరత్రా వస్తువులు ఎలా కొనగోలు చేయాలని వారు ప్రశ్నిస్తున్నారు. ఆరుగాలం కష్టించి పనులు చేస్తూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి చెత్త చెదారం తొలగిస్తూ ఆరోగ్యాలను సైతం లెక్కచేయకుండా పనులు చేస్తే తమకు ఇచ్చే బహుమానం ఇదేనా అని మల్టీపర్పస్ వర్కర్లు ప్రశ్నిస్తున్నారు. ముందే 9 వేల రూపాయల అరకొర వేతనంతో కుటుంబాన్ని పోషించుకో వడం తలకు మించిన భారంగా మారిందని, ఇప్పుడు ఎస్టిఓలకు చెక్కులు వెళ్లిన ప్రతిసారి సమయానికి క్లియర్ చేయక పోవడంతో తాము పడరాని పాట్లు పడుతున్నామని ఇకనైనా అలా కాకుండా ఎస్ టి ఓ లకు వచ్చే చెక్కులను ఎప్పటికప్పుడు క్లియర్ చేసే విధంగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని వారు వేడుకుంటు న్నారు. మిగిలింది ఒకే ఒకరోజు ఉందని తమకు శుక్రవారం వేతనాలు అందే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులకు మల్టీపర్పస్ కార్మికులు విన్నవించుకుంటున్నారు.

కార్మికుల పట్ల వివక్ష ఎందుకు..?

సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్



మల్టీపర్పస్ పేరుతో జీపీ కార్మికుల శ్రమదోపిడీకి పాల్పడుతున్న అధికారులు.. వారికి సకాలంలో వేతనాలు ఎందుకు ఇవ్వడం లేదు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనా ఎస్టీవోలో ఎందుకు ఆపారు..? వారి పట్ల వివక్ష ఎందుకు చూపుతున్నారు. మూడు నెలల నుంచి 9 నెలల వరకు వేతనాలు పెండింగ్‌లో ఉంటే వారి కుటుం బాలు ఎలా బతకాలు..? ఇంత పెద్ద దసరా పండుగను వారు ఏ విధంగా నిర్వహించుకోవాలో అధికారులే సమాధానం చెప్పాలి. వెంటనే చెక్కులు బ్యాంకులకు పంపి కార్మికులకు వేతనాలు వచ్చేలా చొరవ తీసుకోవాలి.

ప్లాంటేషన్లను పరిశీలించిన సెంట్రల్ టీం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని చంద్రయాన్ పల్లి, అమ్సన్ పల్లి గ్రామాలలో నెలకొల్పిన ప్లాంటేషన్లను బుధవారం సెంట్రల్ టీం చెన్నై ఐఆర్ఓ ఇన్స్‌పెక్టర్ జనరల్ త్రినాథ్ కుమార్, డీఎఫ్ఓ వికాస్ మీనా, ఎఫ్డిఓ సుధాకర్ రావు, రేంజ్ అధికారి రవి మోహన్ భట్ లతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. చంద్రయాన్‌పల్లి అటవీ ప్రాంతం నుండి కాళేశ్వరం లిఫ్ట్‌కు అవసరమున్న 220 విద్యుత్ లైన్ పనులు ఇటీవల పూర్తి కావడంతో అటవీ ప్రాంతంలో జరిగిన పనులపై పరిశీలించడానికి ఇన్స్‌పెక్టర్ జనరల్ త్రినాథ్ కుమార్ సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుండి అమ్సన్ పల్లిలో 25 వేల మొక్కలతో నెలకొల్పిన ప్లాంటేషన్లను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. రెండు చోట్ల ఉన్న వివరాలను రేంజ్ అధికారి రవి మోహన్ భట్ వివరాలను అందజేశారు. వీరి వెంట సెక్షన్ అధికారి అతిఖ్ అహ్మద్, బిట్ అధికారులు రంజిత్, నవీన్ రాజ్, ప్రశాంత్, రాకేష్ , స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది ఉన్నారు.



ప్లాంటేషన్ పరిశీలిస్తున్న అధికారులు

రసాభాసగా చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వేల్పూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ రసాభాసగా మారింది. బుధవారం 117 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న తులం బంగారం ఎక్కడంటూ ప్రశ్నించారు. దీంతో రైతువేదికలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం నెలకొంది. దళిత సీఎం, దళితులకు మూడెకరాల భూమి మీరిచ్చారా? అంటూ కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నాయకులను ప్రశ్నించారు. దీంతో ఇరు పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఇరు పార్టీల నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. కాగా నాయకులు అడ్డుకొని సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది.



ఎమ్మెల్యే వేముల, కాంగ్రెస్ నాయకులు వాగ్వాదం



బతుకమ్మ వేడుకల్లో కలెక్టర్‌తో పాటు అధికారులు, సిబ్బంది, మహిళా ఉద్యోగులు

ఘనంగా బతుకమ్మ సంబరాలు

- కలెక్టరేట్‌తో పాటు మానవతసదన్‌లో వేడుకలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/డిచ్‌పల్లి

బతుకమ్మ పండుగను పురస్కరించుకుని గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) వద్ద బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఆయా శాఖల మహిళా ఉద్యోగినులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరై ఈ ఉత్సవంలో భాగస్వాముల య్యారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ తదితరులు ఈ వేడుకల్లో పాల్గొని గౌరీమాతకు, రంగురంగుల పూలతో ఆకట్టుకునే రీతిలో ముస్తాబు చేసిన బతుకమ్మలకు సాంప్రదాయ బద్ధంగా పూజలు చేశారు. అందంగా అలంకరించిన బతుక మ్మలు కనువిందు చేస్తూ, పూల పండుగ ప్రాధాన్యతను చాటాయి. బతుకమ్మ గేయాలను ఆలపిస్తూ మహిళా ఉద్యోగులు యువతులు, మహిళలు లయబద్ధంగా బతుకమ్మ ఆటలాడుతూ ఎంతో ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు. ఈ ఉత్సవాల్లో డీఆర్డీఓ సాయాగౌడ్, టీజీఓల సంఘం అధ్యక్షుడు అలుక కిషన్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రమన్ రెడ్డి, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, వివిధ శాఖల అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

అదే విధంగా డిచ్‌పల్లిలోని మానవతసదన్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా సర్వశిక్షా సెక్టో రియల్ అధికారులు బాలికల అభివృద్ధి అధికారి భాగ్యలక్ష్మీ, సి.యం. ఓ . శ్రీనివాస్ రావు,రోటరీ క్లబ్ అధ్యక్షులు శ్రీవిజయ్ రావు, సెక్రటరీ గంగారెడ్డి ,దర్శన్ సింగ్, బాబు రావు మానవత సదన్ జాయింట్ సెక్రటరీ సుధాకర్ రావు కేర్ టేకర్ అందే రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మానవత సదన్‌లో బతుకమ్మ వేడుకలు..

పెట్టిన ఖర్చులు రాక పస్తులు

- అప్పుల్లో జీపీ కార్యదర్శులు
- గ్రామాల్లో రోజువారి పనుల ఖర్చులకు సొంత డబ్బులు వెచ్చించిన పలువురు కార్యదర్శులు
- ప్రభుత్వం విడుదల చేస్తున్నా.. ప్రత్యేకాధికారులు అడ్డుకుంటున్నట్టు ఆరోపణ



నవతెలంగాణ-నిజామాబాద్

సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన నాటి నుంచి పలు గ్రామాల్లో జీపీ కార్యదర్శులు అన్నీ తామై పనులు చేపడుతున్నారు. అందుకుతగ్గట్టు నిధులు రాకపోవడంతో ఉన్నతాధికారుల సూచన మేరకు అప్పులు తీసుకొచ్చి పనులు చేపట్టేందుకు వెచ్చించారు. ఇలా దాదాపు 8 నెలలు గడుస్తున్నా.. ఖర్చు పెట్టిన డబ్బులు రాకపోవడంతో కార్యదర్శులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ప్రస్తుతం పండుగ పూట చేతిలో చిల్లిగవ్వలేదని మదన పడుతున్నారు. పండుగను ఎలా నిర్వహించుకోవాలని ప్రశ్నిస్తు న్నారు. పెద్దజీపీల్లో వచ్చే పన్నులు ఇతరాత్ర రాబడితో ఖర్చులు నెట్టుకొస్తున్నా.. చిన్న జీపీల కార్యదర్శులకు మాత్రం సరిపడా రాకపోవడంతో తమ జేబులో నుంచి ఖర్చులు పెడుతున్నారు.

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 530 గ్రామపంచాయతీలున్నాయి. సర్పంచ్‌ల పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరితో ముగియడంతో గ్రామాలకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను కేటాయించిన విషయం విధితమే. అయితే ప్రత్యేకాధికారులకు తమ శాఖల పనులు ఉండటంతో అప్పుడప్పుడు జీపీలకు వచ్చి వెళ్తుంటారు. అయితే గ్రామాల్లో నిత్యం ఉండే జీపీ కార్యదర్శులకు గ్రామస్తుల నుంచి ఇక్కట్లు తప్పడం లేదు. గ్రామాల్లో ఏ సమస్య ఉన్నా.. నేరుగా కార్యదర్శి దృష్టికి తీసుకెళు న్నారు. కాగా పనులు చేపట్టేందుకు నిధులు లేకపోవడంతో.. పలు చోట్ల ప్రత్యేకాధికారులు జీపీ కార్యదర్శుల సొంత డబ్బులు ఖర్చు పెట్టించి నిధులు వచ్చాక తీసుకోండి అని చెప్తూ రావడంతో చిన్న జీపీల కార్యదర్శులు అప్పుల పాలు అయ్యారు. పెద్ద పంచాయతీల్లో కొంత మేర సర్దుబాటు అవుతున్నా కానీ చిన్న గ్రామపంచాయతీల్లో నిధులు లేక ఇబ్బందుల పాలవుతన్నామని చిన్న, చిన్న పంచాయతీ కార్యదర్శులు కక్కలేక మింగలేక (కుర్దిల పడ్డ ఎలుక)ల మారింది తమ పరిస్థితి అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సర్పంచ్‌లు ఉన్న సమయంలో ఖర్చులు వారు చూసుకునేది. అయితే వారి కాలపరిమితి ముగింపు దశకు వచ్చిన ఆరు నెలల ముందు నుంచే ప్రతిరోజు ట్రాక్టర్‌కు కావలసిన డీజిల్, కరెంటు బిల్లులు, మల్టి పర్పస్ వర్కర్లకు వేతనాలు చెల్లించడం మానేసినట్టు సమాచారం. దీంతో చేసేదేమిలేక అధికారుల సూచనా మేరకు తాము బరువుబాధ్యతలు తీసుకున్నామని, అప్పు, సప్పు, చేసి పనులు చేపట్టేందుకు ఖర్చులు పెడుతూ వచ్చినట్టు తెలుపుతున్నారు. ప్రతి రోజు డీజిల్, శానిటరింగ్ పనులకు, మంచినీటి సమస్యపై పైపుల లీకేజి పనులకు, బిచింగ్ పౌడర్, అలాగే నూతనంగా ఏర్పడిన ప్రభుత్వ పథకాలకు, ప్రజాపాలన ఖర్చుతో పాటు అలాగే వికసిత భారత్ తదితర కేంద్ర ప్రభుత్వ పథకాలతో పాటు ఇతరాత్ర కార్యక్రమాల ఖర్చులు సైతం కార్యదర్శులు భరిస్తూ వచ్చారు.

ప్రభుత్వ బిల్లులు రాగానే తమకు ఇస్తామన్న ఉన్నత అధికారులు ఇప్పుడు తమకు ఇవ్వడం లేదని కార్యదర్శులు ఆవేదన చెందుతున్నారు. అప్పు చేయడంతో పాటు తమ వేతనాల్లో నుంచి సైతం డబ్బులు తీసుకుంటూ ఖర్చులు చెసి గ్రామస్తుల ఇక్కట్లు పరిష్కరించే ప్రయత్నం చేశామని, కానీ బయటనుండి తెచ్చిన డబ్బులకు మిత్తి కట్టలేక సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కొలువు ఉండి, పండగకు పస్తులుండే కాలంవచ్చిందని, తమ కుటుంబాల్లో సంతోషం లేకుండా అవుతుందని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం బిల్లులు విడుదల చేసినప్పటికీ అధికారులు మాత్రం తమ బిల్లులు చెల్లించడం లేదని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. వచ్చిన బిల్లులు టాక్టర్ ఈఎంఐ లకు, కరెంట్ బకాయిలకు, మల్టీపర్పస్ కార్మికులకు సర్ది చేసి వీటికే సరిపోయాయి అంటూ సెలవు తీసుకుంటున్నారు. తమకు ఉన్నత అధికారులు అందించిన ఆదేశాల అనుసారం బిల్లు చేశామని వాటికే సరిపోయాయని, మిగులు ఏమిలేదని సమాధాన ఇస్తున్నట్లు తెలిపారు. తమ సమస్యలపై గత నెల జిల్లా కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ గారికి ఫిర్యాదు చేశామని, అయినప్పటికీ తమ సమస్య పరిష్కారం కాలేదని పలువురు వాపోతున్నారు. నిధుల విషయమై ఉన్నతాధికారులను అడుగలేకపోతున్నామని, అడిగితే తమపై కక్ష సాధింపు చర్యలు తీసుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించలేదనే చందంగా ప్రభుత్వం బిల్లులు పంపినా అధికారులు అందజేయడం లేదని ఓ పంచాయతీ కార్యదర్శి తమ గోడును నవతెలంగాణతో వెలిబుచ్చుకున్నాడు.

ఆర్థిక సహాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని ముచ్కూర్‌లో పక్షవాతానికి గురై మంచానికి పరిమితమైన ఎనుగందుల సాయవ్వ పరిస్థితి తెలిసిన ముత్యాల సునీల్ రూ.5వేలు ఆర్థిక సాయం బుధవారం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వారి ఇంటికెళ్లి ఆర్థిక సాయం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబీకులు, కాలనీవాసులు ముత్యాల సునీల్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేసి రుణపడి ఉంటామని అన్నారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు బురెడ్డి సంతోషం, గట్టు మురారి, కొరడి లింబాద్రి, సొసైటీ వైస్ చైర్మన్ గంగారెడ్డి, పల్లె లింబన్న, మంద భూమేష్, జోరిగే ప్రశాంత్, గంగయ్య, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

పండుగల ఏర్పాట్లపై సమీక్ష

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో ఎంపీడీవో చింత రాజా శ్రీనివాస్ అధ్యక్షతన అధికారులతో బుధవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. బతుకమ్మ నిర్వహణ, దుర్గాష్టమి, విజయదశమి పండుగల ఏర్పాట్లపై సమావేశంలో చర్చించారు. మండలంలో బతుకమ్మ సంబరాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఎంపీడీవో సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు, శానిటేషన్, ఎల్ఆర్ఎస్, ఎస్సీ,ఎస్టీ సబ్ క్యాస్ట్ ఉద్యోగుల వివరాల సేకరణ, నూతనంగా నర్సరీల ఏర్పాటు పై సమీక్షించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులపై సమావేశంలో చర్చించి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి సదానంద్, ఈజీఎస్ ఏపీవో విద్యానంద్, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్స్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలను వినియోగించుకోవాలి

- హెడ్ పోస్ట్ మాస్టర్ కిషన్ నాయక్



నవతెలంగాణ-ఆర్మూర్

కేంద్ర ప్రభుత్వం పోస్టల్ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పట్టణ ప్రధాన కార్యాలయ హెడ్ పోస్ట్ మాస్టర్ కిషన్ నాయక్ తెలిపారు. పోస్టల్ వారోత్సవాల సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల చరిత్ర కలిగిన తపాలా శాఖ కాలానికి అనుగుణంగా సేవలను విస్తరిస్తుందని అన్నారు. బట్వాడా నుండి మొదలుకొని డిజిటలైజేషన్ వైపు అడుగులు వేస్తుందని, ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా ప్రవేశపెట్టిన ఎన్నో పథకాలు ఉన్నాయని తెలిపారు. అన్ని పోస్టాఫీస్‌లో అందుబాటులో ఉంటాయని, ఈ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాజనీతి శాస్త్రజ్ఞులు కాన్షిరామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి


బాల్కొండ: నివాళ్లుఅర్పిస్తున్న అంబేద్కర్ యువజన సంఘం నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్/ బాల్కొండ

రాజనీతి శాస్త్రజ్ఞులు కాన్షిరాంను ఆదర్శంగా తీసుకోవాలని ధర్మ సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ప్రేమ్ కుమార్ అన్నారు. బుధవారం కాన్షీరాం 18వ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పీడిత ప్రజల పక్షాన పోరాటం చేసి 10 శాతం లేని అగ్రకుల రాజసౌధాన్ని అధికార పీఠాన్ని కూకటి వేళ్ళతో పెకిలించారని అన్నారు. ఇల్లు, భూమి, ఆస్తి లేని కటికె పేదవారు ఈ రాజ్యం పరిపాలించాలి అని గొప్ప ఆలోచనతో ఓటు అనే ఆయుధంతో రాజా సింహాసనంను అందించిన రాజనీతి శాస్త్రజ్ఞులు కాన్షీరాం అని అన్నారు.

బాల్కొండ: మండల కేంద్రంలోని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో కాన్సీరాం 18 వ వర్ధంతి వేడుకలు బుధవారం నిర్వహించి ఆయన చిత్రపటానికి పూల ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు డిఎల్ మాల లింగన్న మాట్లాడుతూ.. భారతదేశ రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టించిన రాజకీయ దురంధరుడు, అనగారిన వర్గాల రాజకీయ దిక్సూచి, పేద ప్రజల ఓటు శక్తితో రాజ్యాన్ని స్థాపించిన గొప్ప పోరాట యోధుడు కాన్షీరాం అని అన్నారు. ఆయన త్యాగమయ పోరాట జీవితం నేటి యువ రాజకీయ తరానికి ఎంతో ఆదర్శనీయ మైనదని తెలిపారు. ఆయన స్ఫూర్తి మార్గంలోనే అణగారిన వర్గాలకి సమన్యాయం అందించే స్వరాజ్యం సాధ్యమవుతుందని కాన్సీరామ్ రాజకీయ పోరాట మార్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలందరిని ఏకం చేసి రాజ్యాన్ని స్థాపించడమే ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ బీసీ నాయకులు కళ్లెం భోజన్న కాపు,గంగా ప్రసాద్ రాజక, వడ్ల రాజేశ్వర్, సల్ల నర్సయ్య కాపు, దాసు, రవి మాల తదితరులు పాల్గొన్నారు.

సహచట్టం పేదవాడి వజ్రాయుధం

- రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం
- 19వ వార్షిక వారోత్సవాలు


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

నవతెలంగాణ-నిజామబాద్ సిటీ

సమాచార హక్కు చట్టం-2005 అనేది పేదవాడికి ఒక వజ్రాయుధం లాంటిదని రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఏ. సలీం (మాజీ న్యాయమూర్తి) అన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సమాచార హక్కు చట్టం 2005 వార్షిక వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. జిల్లాలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కాంతపు గంగాధర్‌ను నిజామాబాద్ జిల్లా అధ్యక్షులుగాను, ఉపాధ్యక్షులుగా ముత్తన్న పల్లి నాగరాజు, జిల్లా మహిళ ప్రధాన కార్యదర్శిగా జై స్వప్న, జిల్లా సెక్రెటరీగా మహమ్మద్ ఖాన్, జిల్లా జాయింట్ సెక్రెటరీగా పి చంద్రశేఖర్‌ను, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా చింత రాజేందర్, మంగోలి ఎల్లయ్యను జాయింట్ సెక్రటరీ గాను ఎన్నుకున్నారు. గతంలో నిజామాబాద్ జిల్లా అధ్యక్షులుగా పని చేసిన అదే ప్రవీణ్‌ను రాష్ట్రస్థాయిలో కార్యదర్శిగా ఎన్నుకున్నారు. సహచట్టంపై అనేక కార్యక్రమాలను నిర్వహించి ప్రజలను చైతన్యవంతులుగా చేసిన ప్రతినిధులకు ప్రశంస పత్రాలు, మెడల్, మెమోంటోలతో సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం మాట్లాడుతూ సహచట్టంద్వారా కావలసిన సమాచారాన్ని సంబంధిత అధికారులద్వారా 30 రోజుల గడువు లోపల తీసుకోవచ్చు అని తెలిపారు. సమాచారం ఇవ్వని అధికారులపై సెక్షన్ 18(1)ప్రకారంగా రాష్ట్ర సమాచార కమిషన్‌కు ఫిర్యాదు చేస్తే 250 రూపాయలు చొప్పున 25 వేల వరకు రాష్ట్ర సమాచార కమిషన్ జరిమాన విధిస్తుందని తెలిపారు.

పోస్ట్ మ్యాన్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

లైన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో బుధవారం పోస్టల్ డే సందర్భంగా పోస్ట్ మాన్ గుండా శ్రీనివాసును సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు చెరుకు పృథ్వీరాజ్ మాట్లాడుతూ ఈ ఆధునిక సమాజంలో పోస్ట్ మ్యాన్‌ల పాత్ర ఎంత ప్రాముఖ్యమైనదని తెలిపారు. కార్యక్రమంలో అంబల్ల తిరుపతి, గుర్రం విజయానంద్, సురేందర్, సునీల్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఫలితాల్లో మాదిగ అభ్యర్థులకు అన్యాయం

- ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి
- నల్లజెండాలతో నిరసన ప్రదర్శన


నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా డీఎస్సీ ఫలితాలు విడుదల చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. మాదిగలకు డీఎస్సీ ఫలితాల ద్వారా జరిగిన అన్యాయానికి నిరసనగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి అన్ని అనుబంధ సంఘాల నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నల్ల జెండాలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన గౌతం నగర్ లోని అంబేద్కర్ నుంచి కలెక్టరు కార్యాలయం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ, ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు సరికెల పోశెటీ మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణను అమలు చేసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పును ఇచ్చిందని, ఈ తీర్పు ద్వారా ముప్పై ఏళ్ల పోరాటానికి న్యాయమైన పరిష్కారం లభించిందని అన్నారు. దేశంలో వర్గీకరణను అమలు చేసే తొలి రాష్ట్రంగా తెలంగాణ ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పి అమలులోకి తేలేదన్నారు. సుప్రీం కోర్టు తీర్పు వచ్చిన తరువాత కూడా రెండు నెలలుగా విద్యారంగంలో అన్ని కోర్సుల అడ్మిషన్లలో మాదిగ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ లేకుండా భర్తీ అవుతున్న 11 వేల టీచర్ నియామకాల్లో మాదిగలకు భారీ నష్టం జరుగుతుందని అన్నారు.

డిసెంబర్ లోగా లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారని, ఎస్సీ వర్గీకరణ లేకుండా లక్ష ఉద్యోగాలు భర్తీ అయితే మాదిగ జాతికి తీరని నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలులోకి వచ్చేంత వరకు ఉద్యోగ నియామకాలు పూర్తిగా నిలిపివేయాలని కోరారు. నిరసనలో ఎంఎస్పి జిల్లా నాయకులు మైలరాం బాలు మాదిగ, యమున, సత్తెక్క, సావిత్రి, పద్మ, భూమన్న, రాజేష్, ప్రవీణ్, మారుతి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: నల్ల జెండాల ప్రదర్శనకు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు వేల్పుల వరుణ్ మాదిగ , సీనియర్ నాయకులు సంకెపల్లి శివ మాదిగ నిజామాబాద్‌కు తరలివెళ్లారు. రేవంత్ రెడ్డి డీఎస్సీ ఫలితాల్లో మాదిగలను మోసం చేస్తున్నారని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును పక్కన పెట్టిన డీఎస్సీ ఫలితాలను విడుదల చెయ్యడం అన్యాయమని అన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ గ్రామ అధ్యక్షులు గట్టు అజయ్, మున్న, సాయన్న, యోగేష్, బబ్లూ, శంకేపల్లి వర్ధన, మనీషా, సుస్వర, తదితరులు పాల్గొన్నారు.

తీరొక్క పూల పండుగ

- రంగురంగుల పుష్పాలే ప్రత్యేకత

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రపంచంలో ఏ పూజకైనా పూవు అవసరం... కానీ పువ్వుని పూజించే సంస్కృతి ఒక్క తెలంగాణలోని ఉంది.

ఆ పండగ సంబరాలు పట్టణంతో పాటు మారుమూల గ్రామాలలో సంబరంగా నిర్వహిస్తున్నారు. ఆడబిడ్డల కోలాటాల సందడి పుట్టింట నెలకొంది.

ఎన్నెన్నో కష్టాలు మరిచి తొమ్మిది రోజులపాటు ఆటపాటలతో మై మరిచి పోతారు. అన్ని పండుగల కంటే భిన్నంగా జరుపుకునే పండుగ. ఈ సందర్భంగా పలువురు నవతెలంగాణతో తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

సంతోషకరమైన పండగ
పైడి సుచరిత రెడ్డి, ఆర్ ఆర్ ఫౌండేషన్ డైరెక్టర్, అంకాపూర్



మహిళలందరికీ సంతోషకరమైన పండుగ బతుకమ్మ. 9 రోజులపాటు పండగ ఉంటుంది. పువ్వును పూజించే పండుగ ఒక్క తెలంగాణలో ఉంది. అన్ని రకాల పువ్వులతో బతుకమ్మను పేర్చుతాం. పండుగ అయిపోయిన నాటి నుంచి మళ్లీ ఎప్పుడు వస్తుందోనని ఎదురు చూస్తుంటాం.

9 రోజులు ఆనందం
వన్నెల దేవి లావణ్య అయ్యప్ప శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్, ఆర్మూర్.



9 రోజులపాటు చిన్న పెద్ద తేడా లేకుండా మహిళలందరం సంబురంగా జరుపుకుంటాం. పేద, ధనిక తేడా లేకుండా అందరూ పాల్గొంటారు. బతుకమ్మ పండుగ ఆడబిడ్డలకి ప్రత్యేకమైన పండుగ. కష్ట సుఖాలను అందరితో పంచుకుంటాం..

తీరొక్క నైవేద్యం
పుష్ప, గృహిణి, ఆర్మూర్



పెసర్లు, మక్కలు, పల్లీలు, నువ్వులతో సత్తుపిండి తయారుచేసి సద్దుల బతుకమ్మ రోజు అందరికీ పంచి పెడతాం. బంధువులు,స్నేహితురాళ్ళ ఒకే చోట చేరి బతుకమ్మ ఆడుకుంటాం.

రెండో విడత సేఫ్టీ మోకుల పంపిణీ


సేఫ్టీ మోకులు అందజేస్తున్న అధికారి

నవతెలంగాణ-కంఠేశ్వర్

రెండో విడత సేఫ్టీ మోకుల పంపిణీ కార్యక్రమం బుధవారం కలెక్టరేట్ బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా బీసి వెల్ఫేర్ ఈడీ రమేష్ గీతాకార్మికులకు సేఫ్టీ మోకులను అందజేశారు. ఈ సందర్భంగా కల్లు గీతకార్మిక సంఘం నాయకులు పెద్ది వెంకట్రాములు, కోయెడి నర్సింలు గౌడ్ మాట్లాడుతూ.. గీతకార్మికులకు రక్షణ కావచంగా సేఫ్టీ మోకులు ఉపయోగపడతాయన్నారు. వీటిని కల్లు గీత కార్మిక సంఘం చొరవతో సాధించుకున్నామని అన్నారు. బీసి శాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కల్లు గీత కార్మిక సంఘం నాయకులు శ్రీరామ్ గౌడ్, సిడుగు శేఖర్ గౌడ్, కోయాడ నర్సింలు గౌడ్, అధికారులు నర్సయ్య, శ్రీనివాస్, జయలలిత, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో మండల ఉపాధ్యాయులకు చోటు

నవతెలంగాణ-ఏర్గట్ల

హైదరాబాద్‌లో జరిగిన పీఆర్టీయూ 35 వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో మండలానికి చెందిన ఉపాధ్యాయులకు రాష్ట్ర కార్యవర్గంలో చోటు దక్కినట్లు మండల అధ్యక్షప్రధాన కార్యదర్శులు ి-కష్ణప్రసాద్, రాజశేఖర్ బుధవారం తెలిపారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా దశెంధర్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పతాని ఉదయ్ కుమార్‌ను ఎంపిక చేశారని అన్నారు.

పేదింటి ఆడబిడ్డల పెళ్లి కోసం...

కేసిఆర్ తెచ్చిన గొప్ప పథకం కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి
- కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ఆసరాగా ఉండటానికి ఒక మేనమామ కట్నంగా కేసిఆర్ కళ్యాణ లక్ష్మీ షాది ముబారక్ పథకాన్ని ప్రారంభించారని రాష్ట్ర మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. బుధవారం కమ్మర్ పల్లి, వేల్పూర్ మండల కేంద్రాల్లోని రైతు వేదిక భవనాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్ లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ అప్పటి పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి మేము అధికారంలోకి రాగానే లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తాం అని మాట ఇచ్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని, వారు అధికారంలోకి వచ్చి 10 నెలలు అయిన ఇచ్చిన తులం బంగారం మాట నెరవేర్చలేదని విమర్శించారు. ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే పెళ్ళిళ్లు జరిగిన ఆడబిడ్డలకు తులం బంగారం కూడా ఇవ్వమని అడుగుతున్నారని, దానికి కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని అన్నారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ దసరా పండుగకు పేదింటి ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారని, ఈ ప్రభుత్వం ఇప్పటి వరకు చీరలు పంపిణీ చేయలేదన్నారు. ప్రతి మహిళకు రూ.2500 ఇవ్వటం లేదని, కేసీఆర్ కిట్ ఆపేశారని, వృద్ధులకు, వింతతువులకు, ఒంటరి మహిళలకు, బీడీ కార్మికులకు రూ.4వేల పెన్షన్ ఇవ్వడం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ సక్రమంగా అమలు చేయకుండా రూ. లక్ష 50వేల కోట్లతో ఎవరికి పనికిరాని మూసి ప్రక్షాళన చేస్తామంటున్నారని విమర్శించారు.

మూసి ప్రక్షాళన పేరుతో పేద ప్రజల ఇండ్లు కూల్చుతున్నారని, దీనివల్ల ఒక్క ఎకరానికైనా లాభం జరుగుతుందా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తులం బంగారం కావాలి అన్నవారు చేతులు ఎత్తాలని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి కోరడంతో మహిళలు అందరూ చేతులెత్తారు. కాంగ్రెస్ నాయకులను నిలదీసిన మహిళలు ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి వెళ్లిన అనంతరం మహిళలు మా కూతుళ్ల పెళ్లిల్లు ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే జరిగాయి. మాకు తులం బంగారం ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులను నిలదీశారు.

కాంగ్రెస్ నాయకుల తప్పుడు వైఖరిని ఖండిస్తున్నాం

- సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ



నవతెలంగాణ-ఆర్మూర్

కాంగ్రెస్ పార్టీ నాయకులు, విత్తనాభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ సుంకెట అన్వేష్ రెడ్డి తప్పుడు వైఖరిని మానుకొని కలెక్టర్కు ఇచ్చిన ఫిర్యాదును వాపస్ తీసుకోవాలని సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి దాసు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఐఎఫ్టియు ఆఫీసులో బుధవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేల్పూర్ మండలంలోని పచ్చల నడుకొడ గ్రామ నివాసి అన్వేష్ రెడ్డి పట్టణంలోని పేదల ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్రూముల కోసం కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనినాడు కూడా మాట్లాడలేదని అన్నారు. కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీల ప్రజా వ్యతిరేక విధానాల వల్లనే 77 ఏండ్ల స్వతంత్ర భారతంలో నిలువ నీడ లేక ప్రభుత్వ స్థలాల్లో పేదలు గుడిసెలు, రేకుల షెడ్లు నిర్మించుకొని జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది పాలకుల అసమర్ధతకు చిహ్నమని ఆయన అన్నారు. ఆయన గత చరిత్రను విస్మరించి మాట్లాడం దురదృష్టకరమని అన్నారు. నిజాంసాగర్ ప్రధాన కాలువతోపాటు వెంకటేశ్వర కాలనీ నుంచి పెర్కిట్ వరకు గల కెనాల్ స్థలంలో పేదలు నిర్మించుకున్న ఇండ్లు తొలగించాలని మాట్లాడటం దుర్మార్గమని ఆయన అన్నారు. ఈ స్థలాల కోసం పేదల పోరాట చరిత్రను విస్మరించి తప్పుడు ఫిర్యాదులు చేయడం సరికాదని సూచించారు. 2009లో అప్పటి కలెక్టర్ రామాంజనేయులు ఈ స్థలాన్ని పరిశీలించి పేదల జోలికివస్తే క్రిమినల్ చట్టాలు పెడతామని కలెక్టర్ హెచ్చరించారని ఆయన తెలిపారు. పేదలకు ప్రభుత్వ పథకంలో ఇల్లు ఇప్పిస్తామని సర్వే చేసి హద్దులు కూడా గుర్తించి పాతించినారని తెలిపారు. రాష్ట్ర ఇరిగేషన్ అధికారులకు కూడా ప్రజల అవసరాలకోసం ఈ స్థలాన్ని వాడు కుంటామని కలెక్టర్ లేఖ రాశారన్నారు. నిజాంసాగర్ సబ్ కెనాల్ డిస్ట్రిబ్యూట్ నెంబర్ 82/2/1పొరకం బంద్లై అనేక సంవత్సరాలు అవుతుందన్నారు. దీనివల్ల సాగునీరు అందడం లేదని అసత్య ప్రకటన ఇవ్వడం శోచనీయమని ఆయన అన్నారు. మున్సిపల్ అధికారులు అక్రమ కట్టడాలకు పర్మిషన్ ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం నియంత్రించాలని తెలిపారు. ముఖ్యమంత్రితో మాట్లాడి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి పేదలకు అండగా నిలవాలని ఆయన అన్వేష్ రెడ్డిని కోరారు. అంతేగాని పేద ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేస్తే ప్రజలు తగిన గుణపాఠం నేర్పిస్తారని అన్నారు. సమావేశంలో సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి బి సూర్యశివాజీ, ప్రజాసంఘాల నాయకులు, ప్రిన్స్, ఎస్ వెంకటేష్, మగ్దూమ్ పటేల్, సయ్యద్ ఇస్మాయిల్, ప్రతాప్, ఫరీద్, అలీ, సాయిరాం, వర్జారెడ్డి, లతీఫ్, పాష, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలకు ఆదర్శం.. డొంకేశ్వర్ సొసైటీ

- రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి


కొనుగోలును ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజకవర్గంలోని అన్ని కోఆపరేటివ్ సొసైటీలకు డొంకేశ్వర్ కోఆపరేటివ్ సొసైటీ ఆదర్శనీయంగా నిలుస్తుందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి అన్నారు. ఈ సొసైటీలో బుధవారం సోయా కొనుగోలు కేంద్రాన్ని అలాగే 20 దేశి గిరిజాతి ఆవులు, 20 కుట్టు మిషన్లు, బైకులను లబ్ధిదారులకు రుణ సౌకర్యాన్ని కల్పిస్తూ అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ ప్రసిద్ధ నందిపేట కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగి రాములు మహారాజ్ , సొసైటీ చైర్మన్ భరత్ రెడ్డి, డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ సాగు చేసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న హార్టికల్చర్ ఆఫీసర్

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని నాగంపేట్ గ్రామంలో ఆయిల్ ఫామ్ తోటలను మండల హార్టికల్చర్ ఆఫీసర్ వినాయక్ 'ప్రీయూనిక్ ఆయిల్‌ఫామ్' కంపెనీ ఏరియా మేనేజర్ తో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ నెల 12న నిజామాబాద్ జిల్లా సరిహద్దు గ్రామమైన పాక్పట్ల గ్రామంలో ఫామ్ ఆయిల్ ఫ్యాక్టరీ శంకుస్థాపన ఉంటుందని గుర్తుచేశారు. వచ్చే సంవత్సరం జూలై వరకు ఆయిల్ ఫామ్ గెలల కోత మొదలవుతుందన్నారు. ఆ సమయానికి ఫ్యాక్టరీ మిల్లింగ్ ప్రారంభం అవుతుందని, రైతులకి ఇబ్బంది లేకుండా ప్రతి 20 కి.మీ ఒక కలెక్షన్ కేంద్రం ఏర్పాటుతో నేరుగా రైతుల వద్దే గెలలను తీసుకోవడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు, ప్రీయూనిక్ ఆయిల్ ఫామ్ కంపెనీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలో తహసీల్దార్ శశిభూషణ్ బుధవారం లబ్ధిదారులకు షాదీముబారక్, కళ్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. నిరుపేద ఆడపిల్లల పెళ్లికి ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థికసహాయం చెక్కులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సాలురా మండల పార్టీ ప్రెసిడెంట్ రవి, సొసైటీ చైర్మన్ జనార్ధన్, సీనియర్ నాయకులు రమేష్, సాలంపాడ్ రవి, కేజీ గంగారం, ఎస్.రవి, పద్మారెడ్డి, లక్ష్మణ్ గ్రామస్థులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీచేస్తున్న తహసీల్దార్

ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన గోవర్ధన్ సాలూరా మండలం హున్సా జిల్లా పరిషత్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తూ పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఎంపికైనందున బుధవారం శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించినట్టు సాటాపూర్ మాజీ సర్పంచ్ ఏకార్‌పాషా తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎస్కే హైమద్, భూమేష్, సంతోష్, ఇమ్రాన్, మధు, నరేష్, అర్జున్, సురేష్, శంకర్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పలువురు

గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు

ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

- కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి
- గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

నవతెలంగాణ-మద్నూర్/పిట్లం

గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం మద్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ నమోదు కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓటర్ నమోదు కౌంటర్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు కార్యక్రమం చేపడుతున్న నేపథ్యంలో 2021 అక్టోబర్ 31వ తేదీకి ముందు డిగ్రీ పాసైన వారు గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సికి ఓటర్‌గా నమోదు చేసుకోవాలని సూచించారు.



పిట్లం: మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి

అదేవిధంగా టీచర్స్ ఎంఎల్‌సికి 2021 అక్టోబర్ 31 నాటికి ఉపాధ్యాయ వృత్తి 3 ఏండ్లు పూర్తి చేసి ఉండాలని తెలిపారు. గ్రాడ్యుయేట్‌లు డిగ్రీ మార్క్స్ షీట్ లేదా ప్రొవిజనల్, లేదా డిగ్రీ పట్టా (కన్వొకేషన్) సర్టిఫికేట్ ఖచ్చితంగా పెట్టాలని తెలిపారు. గ్రామాల్లో, మండల, డివిజన్, కేంద్రాల్లో ఉన్న గ్రాడ్యుయేట్లు ఓటర్‌గా నమోదు చేసుకునే విధంగా రాజకీయ పార్టీలు కృషి చేయాలని కోరారు. పూర్తి చేసిన దరఖాస్తును దరఖాస్తుదారు మాత్రమే కార్యాలయంలో అందజేయాలని అన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులు మొబైల్ ఫోన్‌లో కూడా చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం సంబంధిత ధృవపత్రాలను తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో అందజే యాలన్నారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంఎల్‌సి ఎన్నికల ఓటర్ నమోదు కౌంటర్‌ను పరిశీలించారు. గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సికి దరఖాస్తు చేసుకున్న వారి ధృవపత్రాలను పరిశీలించారు. ప్రతి డాక్యుమెంట్స్‌ను క్షుణంగా పరిశీలించి, విచారించిన అనంతరం ఫైనల్ చేయడానికి సంబంధిత రిటర్నింగ్ అధికారికి పంపాలని ఆదేశించారు. తహసీల్దార్ ముజీబ్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ విజయ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు లక్ష్మణ్, తుకారాం, అజయ్, సంజీవ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ జాబితాను పక్కాగా సిద్ధం చేయాలి..

పిట్లం : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు గాను ఓటర్ జాబితాను సిద్ధం చేయాలని కామారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా పట్టభద్రుల ఓటర్ జాబితాలో పేర్లు గల్లంతు కాకుండా, పేర్లలో అక్షర అచ్చులు తప్పొప్పులు లేకుండా జాగ్రత్త వహిస్తూ ఓటర్ ముసాయిదా జాబితాను పక్కగా రూపొందించాలని సూచించారు. అనంతరం ఎల్‌ఆర్‌ఎస్ గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో కమలాకర్, ఎంపీఓ యాదగిరి, గిర్దావర్ శీతల్, పంచాయతీ సెక్రెటరీ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలు అధైర్యపడొద్దు

- ప్రతిపక్షాల విమర్శలను ప్రజల్లో ఉండి తింపి కొట్టాలి
- జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి



మాట్లాడుతున్న నారెడ్డి మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

కాంగ్రెస్ కార్యకర్తలు ఆధ్వర్యంలో పడవద్దని, కష్టపడ్డ వారికి కచ్చితంగా గుర్తింపు ఉంటుందని బుధవారం జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి కార్యకర్తలు ఉద్దేశించి అన్నారు. అధిష్టానం కష్టపడ్డ కార్యకర్తలను గుర్తించేలా కృషి చేస్తామని, అధిష్టానం కష్టపడ్డ పార్టీ నాయకులను, కార్యకర్తలను గుర్తించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో ఇచ్చిన 6 గ్యారంటీ లను అమలు చేసిందని, కార్యకర్తలు ప్రభుత్వ పథకాల అమలును ప్రతి గడపగడపకు తీసుకెళ్లాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి పొందేలా కృషి చేయాలని సూచించారు. ప్రతిపక్షాల నిరాధార విమర్శలను గ్రామస్థాయి నుండి ప్రతి ఒక్కరు తింపి కొట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఇసన్న పల్లి కాంగ్రెస్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయ చైర్మన్‌ను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్చాలు అందజేశారు. సన్మానించిన వారిలో జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు పుట్నాల శ్రీనివాస్, కామారెడ్డి పట్టణ ఓబీసీ సెల్ అధ్యక్షులు కడెం ప్రవీణ్, రామారెడ్డి మండల ఓబీసీ సెల్ అధ్యక్షులు బండి ప్రవీణ్ తదితరులున్నారు.

గుండెపోటుతో ప్రభుత్వ ఉద్యోగి మృతి

నవతెలంగాణ-బిచ్కుంద



బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి అనిల్ (35) మంగళవారం గుండెపోటుతో మృతిచెందారు. గతంలో బిచ్కుంద మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏగా విధులు నిర్వహించిన అనిల్ గత సంవత్సరం ప్రమోషన్ రావడంతో ములుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. దసరా పండుగ సెలవులు ఉండడంతో తన స్వస్థలమైన బిచ్కుందకు వచ్చారు. మంగళవారం రాత్రి గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు స్థానికులు బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బుధవారం మండల కేంద్రంలో అనిల్ అంత్యక్రియలు నిర్వహించారు. మృతి చెందిన అనిల్‌కు భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. అనిల్ మృతి పట్ల కుటుంబ సభ్యులు, స్థానికులు, స్నేహితులు శోకసముద్రంలో మునిగిపోయారు.

అనాథ పిల్లలకు దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-బోధన్

బోధన్ రేషన్ డీలర్స్ ఆధ్వర్యంలో దసరా పండుగ సందర్భంగా అనాథ పిల్లలను ఆదుకోవాలనే లక్ష్యంతో నూతన దుస్తులు కొనుగోలు చేశారు. ఈ దుస్తులను బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సబ్ కలెక్టర్ వికాస్ మహతో చేతుల మీదుగా అనాథ పిల్లలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనాథ పిల్లలు రేషన్ డీలర్ల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.


డీఎస్సీలో మాదిగ అభ్యర్థులకు అన్యాయం

- ఎస్సీ వర్గీకరణ అమలు కాకుండానే డీఎస్సీ ఫలితాలు

నవతెలంగాణ-కామారెడ్డి

డీఎస్సీలో మాదిగ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రైల్వేకమాన్ అంబేద్కర్ విగ్రహం నుంచి ర్యాలీగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు సత్తిగాని లక్ష్మి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి వెంకటరమణ, మాచారెడ్డి మండల అధ్యక్షులు బట్ట రమేష్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కొరకు గత 30 సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పోరాటం ద్వారానే సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ చేయాలని చెప్పిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి గత రెండు నెలల క్రితం అసెంబ్లీ సాక్షిగా వెంటనే ఎస్సీ వర్గీకరణ చేస్తానని చెప్పి ఎస్సీ వర్గీకరణ చేయకుండానే డీఎస్సీ ఫలితాలు విడుదల చేయడంతో ఎమ్మార్పీఎస్ విద్యార్థులకు అన్యాయం జరిగిందని అన్నారు. ఇప్పటికైనా వెంటనే సీఎం రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నాలు, ఆందోళనలు చేస్తామని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కంతి పద్మారావు, బాన్సువాడ అధ్యక్షులు బాల్ రాజు, రామారెడ్డి మండల మహిళా అధ్యక్షురాలు లావణ్య, సురేష్, కాశిరం, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయ చైర్మన్‌కు సన్మానం



గ్రంథాలయ చైర్మన్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-భిక్కనూర్

నూతనంగా కామారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా నియామకమైన మద్ది చంద్రకాంత్‌రెడ్డిని సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పుట్నాల శ్రీనివాస్ యాదవ్, కామారెడ్డి పట్టణ ఓబీసీ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, రామారెడ్డి మండల ఓబీసీ సెల్ అధ్యక్షులు బండి ప్రవీణ్, ఓబిసి సోషల్ మీడియా ఇంచార్జ్ భాస్కర్ బుధవారం ఘనంగా శాలువా కప్పి సన్మానించారు. అలాగే పట్టణంలోని పాత హరిజనవాడ కాలనీకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కిరణ్, సుధాకర్, బాలరాజు, సురేష్, పంచాక్షరి, రవీందర్, ప్రసాద్, రమేష్, మల్లేష్, శాలువాతో ఘనంగా సన్మానించారు.

రోడ్డుపై మురికి నీరు.. పట్టించుకోని అధికారులు

- బాన్సువాడలో అపరిశుభ్రతకు నిలయం

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

బాన్సువాడ పట్టణంలో రోడ్డుపై మురికి నీరు ప్రవహించడం పట్ల పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బాన్సువాడ మున్సిపల్ పరిధిలోని 15వార్డ్‌లోని ప్రధాన దారిపై సిమెంట్ రోడ్డు వేసే అప్పుడు గుంతలు గుంతలుగా వేయడం.. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక రోడ్లు మురికి నీటి కాలువలుగా మారుతున్నాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో సరైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేక ఇళ్ల నుంచి వచ్చే మురికినీరు, అలాగే వర్షం నీరు రోడ్లపైనే నిలబడుతూ రోడ్లు గుంతలమయంగా మారి రాకపోకలకు ఇబ్బందిగా మారుతున్నది. దీనికితోడు సిమెంటు రోడ్లు ఉన్న వీధుల్లో చాలావరకు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేని పరిస్థితి ఉంది. ఫలితంగా మురికి నీరు, వర్షం నీరు సిమెంటు రోడ్లపైనే నిలబడి ఉంటోంది. దీంతో బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిమెంటు రోడ్లపై మురికినీరు నిలబడడం వలన పాచిపట్టి దానిపై నడిచే సందర్భంలో జారి కిందపడి గాయాలపాలవుతున్నారు. గుంతలుగా ఉన్న రోడ్డును సిమెంట్‌తో పెంచాలని, డ్రైనేజీ వ్యవస్థ బాగుచేయాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



రోడ్డుపైనే మురికినీరు

ఇరువురి నిర్లక్ష్యం.. ప్రయాణికుల అవస్థలు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నిజామాబాద్ నుంచి బాన్సువాడకు ప్రయాణికులతో వెళ్తున్న ఓ ఆర్టీసీ బస్సు నిజామాబాద్ నుంచి బాన్సువాడకు వెళ్తున్న ఓ టాటా ఎస్ వాహనాల డ్రైవర్ల నిర్లక్ష్యంతో వాగ్వివాదం పెట్టుకోవడంతో గంటల తరబడి ప్రయాణికులు అవస్థలు పడ్డారు. నసురుల్లాబాద్ మండలం అంకోల్ క్యాంపు వద్ద నిజామాబాద్ నుంచి ప్రయాణికులతో వస్తున్న ఆర్టీసీ బస్సు ముందు బర్రె ఉందని బ్రేక్ వేయడంతో వెనుకనే ఉన్న టాటా ఏస్ వాహనం ఆర్టీసీ బస్సును ఢీ కొట్టింది. దీంతో టాటా ఏస్ అద్దం పగిలింది. నీ నిర్లక్ష్యం అంటే నీ నిర్లక్ష్యం అంటూ ఒకరిపై ఒకరు వాగ్వివాదం పెట్టుకుంటూ అర్ధగంట పాటు బస్సును రోడ్డుపై నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థకు గురయ్యారు. ఇరువురు వారి యజమానులకు ఫోన్ ద్వారా సమాచారం అందించినా.. ఒకరి కంటే మరొకరు నష్టపరిహారం ఇవ్వాలంటూ పట్టుబట్టి కూర్చున్నారు. దీంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రయాణికులను బస్టాండ్‌లో వదిలేసి మీరు ఏదైనా మాట్లాడుకోండి అంటూ ఆర్టిసి డ్రైవర్‌కు సూచించడంతో అక్కడి నుండి ఆర్టీసీ బస్సు బాన్సువాడకు వెళ్ళింది.



పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు అవసరం

- ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాయిస్థా ఫిర్దోస్

నవతెలంగాణ-ఎడపల్లి

పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్త చర్యలు అవసరమని ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి సాయిస్త ఫిర్దోస్ అన్నారు. బుధవారం మండలంలోని బాపునగర్ అంగన్వాడీ కేంద్రంలో బరువు తక్కువగా ఉన్న పిల్లలకు ఆరోగ్య వైద్యాధికారి స్క్రీనింగ్ చేశారు. అలాగే గర్భిణీ బాలింతలకు పిల్లల తల్లులకు గ్రామస్తులకు తీసుకోవలసిన ఆహారం గురించి ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన శ్రద్ధ గురించి క్షుణంగా వివరించారు. బాలింతలకు, చిన్నారులకు, గర్భిణులకు ఏమైనా సమస్యలు వస్తే వెంటనే అంగన్వాడీ ఉపాధ్యాయురాలు, ఆశావర్కర్ దృష్టికి తీసుకువచ్చి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. పిల్లలకు సరైన సమయంలో పౌష్టికాహారం అందించాలని అన్నారు. ఐసిడిఎస్ బోధన్ ప్రాజెక్ట్ ఎడపల్లి మండల పర్యవేక్షకురాలు విజయరాణి మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల ఉపాధ్యాయులు సమయపాలన పాటించి, చిన్నారి బాలబాలికలకు పూర్వ ప్రాథమిక విద్యా స్థాయి బోధతో పాటు ఆట పాటలను నేర్పించాలని అన్నారు. పిల్లల ఆరోగ్యం పట్ల అంగన్వాడీ ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పిల్లల బరువును, ఎత్తును ఇప్పటికప్పుడు తూకం చేయాలన్నారు. కార్యక్రమంలో బాపునగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి పద్మావతి, అంగన్వాడీ ఉపాధ్యాయురాలు లలిత, ఆశావర్కర్ రంగమ్మ, మహిళా గర్భిణీలు, చిన్నారి బాలబాలికల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి సాయిస్థా ఫిర్దోస్

రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో తహసిల్దార్ మహేందర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రానున్న స్థానిక ఎన్నికలలో ఓటు వేయడానికి ఓటర్ జాబితాలో పేరు లేని అర్హులను గుర్తించి పేరు నమోదు చేసుకోవడానికి గ్రామస్థాయి నుండి అప్రమత్తం చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడానికి అర్హులైన వారికి ఓటర్ లిస్టులో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో పోలింగ్ బూతులు పెంచడానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శకావత్ అలీ, బిఆర్ఎస్ పార్టీ నాయకులు సతీష్, ఎంఐఎం పార్టీ నాయకులు అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

మంజీరా నదిలో గుర్తు తెలియని శవం లభ్యం

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండలంలోని వాజిద్‌నగర్ మంజీరా నదిలో గుర్తుతెలియని వ్యక్తి శవం కొట్టుకువచ్చిందని ఎస్ఐ మోహన్ రెడ్డి తెలిపారు. మృతుని వయసు (30) వరకు ఉంటుందని, అతని కుడి చేతిపై సోను అని ఇంగ్లీషులో రాసి ఉందని అన్నారు. అతను నల్లటి పాయింట్ ధరించి ఉన్నాడని శరీరంపై ఎలాంటి గాయాలు లేవని అతనిని గుర్తు పట్టిన వారు 8712686175, 8712686176 నెంబర్లకు ఫోన్ చేయాలని లేదా నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వివరాలు తెలపాలని ఎస్సై కోరారు.

ఉపాధి హామీ పనులు పరిశీలించిన జలశక్తి అభియాన్ బృందం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని రాఘవపల్లి గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన ఉపాధి హామీ పనులలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలు, చెరువు పూడికతీత పనులను బుధవారం కేంద్ర జలశక్తి అభ్యాన్ బృందం పరిశీలించారు. మండల వ్యాప్తంగా నిర్వహించిన ఉపాధి హామీ పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జలశక్తి అభియాన్ శ్రీ బెంజిమాన్ కరుణాకరన్, డిప్యూటీ సెక్రటరీ సెంట్రల్ నోడల్ ఆఫీసర్, డీఆర్డిఏ పిడి సురేందర్, ఎంపీడీవో ప్రభాకర్ చారి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న దాబాలపై కేసులు

నవతెలంగాణ-బిచ్కుంద

మండలంలోని జాతీయ రహదారి పక్కన గల దాబాల్లో మద్యం విక్రయిస్తూ సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారనే పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిఐ, ఎస్ఐ, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పత్లాపూర్ గ్రామ శివారులో గల జాతీయ రహదారి పక్కన నిర్వహిస్తున్న 36 దాబాల్లో 17.26 మద్యం దొరకగా వాటి విలువ రూ.4,621 ఉంది. పారడైస్ దాబాలో 20.81 లీటర్ల రూ.7,038 విలువగల మద్యం దొరికిందని పారడైస్ దాబా యజమాని మహేష్, 36 దాబా యజమాని గంగాధర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ దీపాలు పనిచేయకపోతే వెంటనే మరమ్మతులు చేయాలి

- దగ్గరుండి ఐమాస్ లైట్లకు మరమ్మతులు చేయించిన చైర్మన్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపల్ కేంద్ర పరిధిలో ఫైర్ స్టేషన్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ప్రధాన కూడళ్లలో ఉన్న హైమాస్ లైట్లు ఇటీవల కురిసిన వర్షానికి సక్రమంగా పనిచేయకపోవడంతో మున్సిపల్ చైర్మన్ పరిశీలించి బుధవారం మరమ్మతులు చేయించారు. మున్సిపల్ కేంద్రంలో ఎక్కడ విద్యుత్ దీపాలు పనిచేయకపోయినా వెంటనే స్పందించాలని, మరమ్మతులు చేసి స్థానికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం 2వ వార్డు, 3వ వార్డులలో నూతనంగా వేసిన బోరు బావులకు మోటర్లు బిగించడంతో బుధవారం ప్రారంభించారు. మున్సిపల్ పరిధిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమాలలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, ఏఈ వినోద్, 12వ వార్డు కౌన్సిలర్ నీలకంఠం, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, తిరుపతి, పోచయ్య, రఫీక్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఏబిసి సెంటర్ కోసం స్థలం పరిశీలించిన డీపీవో

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండలంలోని గోపన్‌పల్లి గ్రామ సమీపాన గల రాజయ్య క్రషర్ మిషన్ పక్కన ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 496లో అనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ (ఏబీసీ) నిర్మాణానికి జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ స్థలాన్ని బుధవారం పరిశీలించారు. బాన్సువాడ డివిజన్ పరిధిలోని బిచ్కుందలో అనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ నిర్మాణం చేయడం వలన వీధి కుక్కలకు యాంటీ ర్యాబీస్ ఇంజక్షన్లు వేయడంతోపాటు సంతాన ఉత్పత్తి కలగకుండా ఆపరేషన్‌లు చేయడం జరుగుతుందన్నారు. ఈ సెంటర్లో వెటర్నరీ వైద్యులు ఇతర సిబ్బంది ఉంటారని బాన్సువాడ డివిజన్ పరిధిలోని ఆయా గ్రామాల్లో గల వీధి కుక్కలను ఇక్కడకు తీసుకువచ్చి చికిత్సలు చేయడం వల్ల కుక్కల సంతానోత్పత్తి పెరగకుండా నివారించవచ్చని యాంటీ రాబిస్ ఇంజక్షన్ వేయడం వలన కుక్క కాటుకు గురైన వారికి ఎలాంటి ఇన్ఫెక్షన్ బారిన పడకుండా నివారించవచ్చు అన్నారు. ప్రస్తుతం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏబిసి సెంటర్‌లో వెటర్నరీ వైద్యులు సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రారంభించినట్లు తెలిపారు. ఆయన వెంట డిఎల్పిఓ నాగరాజు, ఎంపీడీవో గోపాలకృష్ణ, ఎంపీఓ అబ్బుగౌడ్, ఆర్ఐ రవీందర్, కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ సిబ్బంది ఉన్నారు.

యువకులు క్రీడలపై ఆసక్తి చూపాలి

- క్రికెట్ టోర్నమెంట్ అట్టహాసంగా ముగింపు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బీర్కూర్ మండలం వీరాపూర్ గ్రామంలో మిర్జాపూర్ సొసైటీ అధ్యక్షుడు రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ ముగింపు పోటీలకు బుధవారం బీర్కూర్ ఎస్సై రాజశేఖర్, నసురుల్లాబాద్ ఇంచార్జ్ ఎస్సై పటేల్ వెంకట్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గత మూడు రోజుల క్రితం ఉమ్మడి మండలం యువ క్రీడాకారుల కోసం క్రికెట్ టోర్నమెంట్‌ను మిర్జాపూర్ సొసైటీ చైర్మన్ రాంబాబు ఏర్పాటు చేశారు. ఇందులో 14 జట్లు పాల్గొన్నాయి. చివరిలో ఫైనల్ పోటీలో మీర్జాపూర్ గ్రామానికి చెందిన ఏ జట్టు, సి జట్టు పోటీపడ్డాయి. ఇందులో మీర్జాపూర్ సి జట్టు ఫైనల్‌లో గెలుపొందింది. గెలుపొందిన క్రీడాకారులకు ఇరువురు ఎస్ఐలు, సొసైటీ చైర్మన్ గ్రామ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. మిర్జా పూర్ సి జట్టు క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మిర్జాపూర్ సొసైటీ చైర్మన్ రాంబాబు మాట్లాడుతూ.. యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలన్నారు. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని తెలిపారు. ఓడినా గెలిచిన క్రీడా స్ఫూర్తితో వ్యవహరించాలన్నారు. ఏ క్రీడలోనైనా క్రీడాకారులు తమ ప్రతిభను మెరుగుపరుచుకుంటూ ముందుకు సాగినప్పుడు విజయాలు దరిచేరుతాయన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

అధిష్టానం ఆదేశాలకు లోబడి పని చేస్తా

- ఎస్సీ సెల్ జుక్కల్ చైర్మన్ అరవింద్

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

అధిష్టాన ఆదేశాలకు లోబడి పని చేస్తానని జుక్కల్ ఎస్సీ సెల్ చైర్మన్ అరవింద్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో కొన్ని సంవత్సరాలుగా తాను చేసిన సేవలను గుర్తించి ఢిల్లీ అధిష్టానం, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్ లిలోతియా ఆదేశాల మేరకు జుక్కల్ నియోజకవర్గ ఎస్సీ సెల్ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించిన అధిష్టానానికి తను కట్టుబడి ఉంటానని సౌదగర్ అరవింద్ అన్నారు. భారత రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి తిరిగి భారత రాజ్యాంగ పరిరక్షణపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తానని అన్నారు. స్థానిక నాయకులు ఏమి తెలియకుండా నన్ను రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేక కల్ల బొల్లి మాటలు చెప్పి పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. తనను 2023లో పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు, పార్టీకి వ్యతిరేకంగా పనిచేసినట్లు మాట్లాడం సరికాదని ఆయన అన్నారు. ఎప్పుడూ కాంగ్రెస్‌తోనే, కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని తెలియజేశారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి సన్మానించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ జక్కని సంధ్య మధుసూదన్ కుమార్తె శ్రీ వర్శిని వరంగల్ లోని ప్రతిమ రికవరీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కాలేజీలో ఎంబీబీఎస్ లో సీటు సాధించింది. దీంతో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి బుధవారం వేల్పూర్ లోని తన నివాసంలో ఆమెను శాలువాతో సన్మానించారు. చక్కగా చదివి పేద ప్రజలకు వైద్య సేవలందించాలని కోరారు. శ్రీ వర్శినిని క్రమశిక్షణతో తీర్చిదిద్ది,చదువులో సహకారం అందించిన తల్లిదండ్రులను అభినందించారు.వారి వెంట బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు పూర్ణానందం ఉన్నారు.



విద్యార్థినిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

సిట్టింగ్ బెంచీల వితరణ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామానికి చెందిన గణేష్ ఎలక్ట్రికల్ షాపు యజమాని తన తల్లిదండ్రులు పెసరి గంగారం-ఆశమ్మ జ్ఞాపకార్థం, ప్రజల సౌకర్యార్థం 12 సిట్టింగ్ బెంచిలను వితరణ చేశారు. బెంచీలను మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, బస్టాండ్ ప్రాంగణంలో, బషీరాబాద్‌లోని కమ్మర్‌పల్లి ఐటిఐ కళాశాల ప్రాంగణం, బషీరాబాద్ గ్రామంలో వివిధ వీధుల్లో అమర్చారు. వీటిని కమ్మర్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం సిట్టింగ్ బెంచి లను ఏర్పాటు చేసిన గణేష్ ఎలక్ట్రికల్ షాపు నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, మైనార్టీ సెల్ జిల్లా గౌరవ అధ్యక్షులు అబ్దుల్ రఫీ, నాయకులు కప్పదండి అశోక్, సింగిరెడ్డి శేఖర్, మారయ్య, ఎలక్ట్రికల్ షాప్ యజమాని, దాత పెసరి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవం విజయవంతం చేయండి



మాట్లాడుతున్న కోయేడి నర్సింలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నవంబర్ 8, 9 తేదీలలో నిర్వహించనున్న బాలోత్సవాన్ని అందరి భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహిద్దామని జేవివి జిల్లా అధ్యక్షులు కోయడి నర్సింలు అన్నారు. నాందేవ్ వాడలోని ట్రస్ట్ కార్యాలయంలో బుధవారం నిజామాబాద్ బాలోత్సవం ప్రచార కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బాలోత్సవం విజయవంతానికి కరపత్రాలు, బ్రోచర్లు ముద్రించాలని, అలాగే ముఖ్యమైన సెంటర్స్‌లో ఫ్లెక్సీలు, పోస్టర్స్ వేయాలని నిర్ణయించారు. ప్రచార మాద్యమాలైన ప్రింట్, సోషల్ మీడియాను ఉపయోగించుకోవాలని దీనికి మధు, అనిత, విగ్నేష్ లను బాద్యులుగా, అలాగే స్టేజి ఆవరణలో స్లొగన్స్ సెలక్ట్ చేయడానికి శ్రీనివాస్ తో పాటు కమిటీ బాధ్యత తీసుకోవాలని నిర్ణయం చేశారు. కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ కోశాధికారి రామ్మోహన్‌రావు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

విలీన సభ పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఐఎఫ్‌టీయును టీయుసీఐ లో విలీనం చేస్తూ ఈనెల 20న హైదరాబాద్‌లో జరిగే విలీన సభ ప్రచార పోస్టర్లను ఐఎఫ్‌టీయు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శ్రామిక నగర్‌లో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ముత్తెన్న, ఎం.సుధాకర్ మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు ముఖ్యంగా మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లుగా కార్మిక వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తుందన్నారు. దేశ సంపదను, కార్మికుల జీవితాలను కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెడుతుందన్నారు. మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టడానికి బలమైన కార్మిక ఉద్యమ నిర్మాణం అవసరమన్నారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే 17 రాష్ట్రాల్లో కార్మికుల పక్షాన పోరాడుతున్న టి.యు.సి.ఐ లో ఐ.ఎఫ్.టి.యు ను విలీనం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో దేశంలో కార్మికుల హక్కుల కోసం కనీస వేతనాల అమలుకోసం కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్ ల రద్దు కోసం మరింత విప్లవ స్ఫూర్తితో పోరాడుతామన్నారు. ఇప్పటికే దేశ రాజధాని ఢిల్లీలో రెండు కార్మిక సంఘాల విలీనం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఈనెల 20న హైదరాబాదు, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విలీన సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభకు జిల్లాలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు విచ్చేసి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నరేందర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వెంకన్న, డి.రాజేశ్వర్ జిల్లా సహాయ కార్యదర్శులు బి.మల్లేష్, ఆర్.రమేష్ జిల్లా నాయకులు బి.మురళి, సాయికుమార్, సత్తెక్క తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్ రెడ్డి మాటలను ఖండిస్తున్నాం


డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి మాట్లాడిన మాటలని తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజలకు ప్రతి పథకం అందే విధంగా పర్యవేక్షిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు వెళ్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల కంటే ముందు టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న చివరి రెండు సంవత్సరాలు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పెండింగ్లో బీఆర్ఎస్ నాయకులు, ప్రశాంత్ రెడ్డి ఇప్పించలేదని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి గతంలో బీఆర్ఎస్ పెండింగ్లో ఉంచిన షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను మంజూరు చేస్తుంటే తులం బంగారం ఏది అని ప్రశ్నిస్తున్న ప్రశాంత్ రెడ్డికి జ్ఞానం ఉందా లేదా అని మానాల మోహన్ రెడ్డి ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు దాదాపు 40వేల కోట్లు పెండింగ్‌లో ఉంచిన దుర్మార్గులు టీఆర్ఎస్ నాయకులని దుయ్యబట్టారు. రాష్ట్రానికి 7లక్షల కోట్ల అప్పును, 40వేల కోట్ల బకాయిలను ఉంచింది టిఆర్ఎస్ నాయకులని తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ అని,ఇంటికొక ఉద్యోగం అని, దళిత ముఖ్యమంత్రి అని ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ పార్టీగురించి మాట్లాడే నైతిక హక్కు లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులని ఎక్కడికక్కడ నిలదీయాలని కాంగ్రెస్ నాయకులకు మానాల పిలుపునిచ్చారు.

ఆరవ వార్డులో వీధిలైట్ల ఏర్పాటు

నవతెలంగాణ-ఆర్మూర్



మున్సిపల్ పరిధిలోని ఆరవ వార్డులో బుధవారం బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా వీధిలైట్లను ఏర్పాటు చేసినట్టు కౌన్సిలర్ పొద్దుటూరి మురళీధర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మున్సిప ల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోస్ట్‌మ్యాన్ గంగాధర్‌కు సన్మానం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ లయన్ సహారా ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకొని అత్యుత్తమ సేవలు అందిస్తున్న బోర్గాం పి పోస్ట్‌మ్యాన్ గంగాధర్‌ను ఘనంగా సన్మానించారు. లయన్ సహారా జిల్లా కార్యదర్శి ఉదయ సూర్య భగవాన్ మాట్లాడుతూ.. తపాలా సేవలు చాలా ముఖ్యమైనవని, వీటికి యూరప్ దేశాలలో ఇప్పటికీ ప్రాముఖ్యత ఇస్తారని అన్నారు. 1969లో టోక్యోలో జరిగిన యుపియు కాంగ్రెస్‌లో ప్రపంచ తపాల దినోత్సవాన్ని ప్రకటించారన్నారు. కమ్యూనికేషన్, వాణిజ్యం, అభివృద్ధికి పోస్టల్ వ్యవస్థ కీలకమన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు నరసింహారావు, కోశాధికారి షేక్ అహ్మద్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీ వారికే రేషన్ డీలర్‌షిప్?

- డీలర్ల నియామకంలో ఓ రెవెన్యూ అధికారి 'హస్తం'
- విచారణ చేపట్టాలని అభ్యర్థుల డిమాండ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రేషన్ షాపుల కేటాయింపులో నిబంధనలు తుంగలో తొక్కారని, రేషన్ షాపుల కేటాయింపులో రెవెన్యూ అధికారి హస్తం ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. అర్హులను కాకుండా ప్రజాప్రతినిధులు చెప్పిన వారికి రేషన్ షాపులను కేటాయిస్తున్నారని దరఖాస్తు చేసుకున్న పలువురు విమర్శిస్తున్నారు.

నిజామాబాద్ డివిజన్ రెవెన్యూశాఖ అధికారి రేషన్ డీలర్లకోసం నియామకంలో నిబంధనలు పూర్తిగా తుంగలో తొక్కారని దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. నిజామాబాద్ డివిజన్ ఆర్డీఓ రేషన్ షాపులకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారిని ఎంపిక చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు చెప్పిన వారికి, పరీక్షలు రాయని వారికి, ఇంటర్వ్యూలో ఎంపిక కాని వారికి రేషన్ షాపులను అంటగట్టారని రేషన్ డీలర్‌కోసం పరీక్షలు రాసిన వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు అర్హత పొందిన వారికే రేషన్ షాపులు ఇవ్వాలని దరఖాస్తుదారులు వేడుకుంటున్నారు. దీనిని కలెక్టర్ స్వయంగా పరిశీలించి అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రేషన్ షాప్ కొసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.



ఫైల్

గత సెప్టెంబర్ 26 న 38 రేషన్ షాపులకు 418 దరఖాస్తు రాగా అందులో 393 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. అందులో మంచి మార్కులు సాధించిన వారికి అదేవిధంగా అధికారులు ఇచ్చిన నియమ నిబంధనలు ప్రకారం కేటాయించిన అభ్యర్థులనే ఎంపిక చేయవలసి ఉంది. కానీ ఎవరైతే ప్రజా ప్రతినిధులకు జేజేలు కొడుతున్నారో...జెండాలు మోస్తున్నారో... వారు పరీక్ష రాయకపోయినా ఇంటర్వ్యూకు హాజరు కాకపోయినా ఎటువంటి అర్హతలు లేకపోయిన వారికి రేషన్ షాపులను అంటగడుతున్నారని దరఖాస్తుదారులు ఆరోపణలు చేయుచున్నారు. అంతేకాకుండా పరీక్షలో ఉత్తీర్ణులైన వారి మార్కుల జాబితాను బహిర్గతం చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

బోర్గం ఎస్సీ మాల రిజర్వేషన్ కోటాలో కూడా అవకతవకలు జరిగాయని, మార్వాడి గల్లీ రేషన్ షాప్ నంబర్ 1890040 కు చెందిన శివకుమార్ అనే వ్యక్తికి మొదటి స్థానంలో పేరు వచ్చినప్పటికీ కూడా ఆయనకు చెందకుండా మూడో స్థానంలో ఉన్న వ్యక్తికి రేషన్ షాప్ దక్కడం పలు అనుమానాలకు తావు ఇస్తుందని బాధితుడు ఆరోపించారు. మాక్లూర్ మండలం లోని గొట్టుముక్కల గ్రామానికి చెందిన గ్రామస్థులకు కాకుండా వల్లభాపూర్ గ్రామానికి చెందిన గ్రామస్తునికి రేషన్ షాప్ దక్కడంపై అనుమానాలున్నాయని బాధితులు మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓని ప్రశ్నించారు. ఇంకా ఎన్నో రేషన్ షాపుల ఎంపికలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తున్నారు. అధికారి పార్టీ నాయకులు అంట కట్టారని అభ్యర్థుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ -బాల్కొండ

మండల కేంద్రంలోని నెహ్రూ నగర్ లో మదీనా కాలనీకి చెందిన ఎండి ఖాదర్ ఇటీవల గుండెపోటుతో మరణించారు. బాధిత కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి బుధవారం 5000 అయిదు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో బాల్కొండ పట్టణ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్ ,బాల్కొండ మండల మైనారిటీ అధ్యక్షుడు జావిద్, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇమ్రాన్ ఖాన్, ప్రవీణ్ గౌడ్, సంతోష్ గౌడ్, వడ్ల రాజేశ్వర్, మార పురుషోత్తం, గడ్డం రవి, దివాన్ వెంకటేష్, బండి మల్లేష్, నవీన్ కుమార్, గోపు ఉషన్న, శ్రీవర్ధన్, బిట్టు, చిట్టి, తేజ, కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌ను అభినందించిన ఎమ్మెల్యే



అభినందిస్తున్న ఎమ్మెల్యే వేముల

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ పాలెపు నర్సయ్యను రాష్ట్ర మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అభినందించారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఇరువురు కలిశారు. పాలేపు నర్సయ్యను చూడగానే ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఆత్మీయ ఆలింగనం చేసుకొని ఆశీర్వదించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పాలెపు నర్సయ్య బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులుగా పార్టీకి తన అమూల్యమైన సేవలందించారని అన్నారు.

రుణాల లక్ష్య సాధనకు కృషి చేయాలి

- బ్యాంకర్ల సమావేశంలో అదనపు కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఆయా రంగాలకు రుణాల పంపిణీలో నిర్దేశిత లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. ప్రత్యేకించి పంట రుణాల పంపిణీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో బుధవారం జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ మొదటి త్రైమాసిక సమావేశం జరిగింది. 2024-25 ఖరీఫ్ సీజన్ కు సంబంధించి కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి గురించి బ్యాంకుల వారీగా అదనపు కలెక్టర్ సమీక్షించారు. రూ 2640 కోట్లు పంట రుణాలుగా అందించాలని లక్ష్యం కాగా, రూ. 1011.95 కోట్లు పంపిణీ చేసి 38.33 శాతం లక్ష్యాన్ని సాధించడం జరిగిందని, గడువు పూర్తయ్యేలోపు రైతులకు విరివిగా ఆర్థిక చేయూతను అందించి పూర్తి స్థాయిలో పంట రుణాల లక్ష్యాన్ని సాధించేందుకు బ్యాంకర్లు అందరూ చొరవ చూపాలన్నారు. రబీలో రూ.1762.74 కోట్ల రుణ పంపిణీ లక్ష్యాన్ని అధిగమించాలని అన్నారు. గత 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్ సీజన్ లో రూ. 2437 కోట్ల రుణాలకు గాను రూ. 1801.72 కోట్లు పంపిణీ చేసి 73.94 లక్ష్యాన్ని సాధించారని, రబీ సీజన్లో రూ.1625.20 కోట్లకు గాను రూ.1545.65 కోట్లు పంపిణీ చేసి 95.11 శాతం లక్ష్య సాధన జరిగిందని తెలిపారు. ఆయా రంగాల్లో పలు బ్యాంకులు లక్ష్యానికి అనుగుణంగా రుణాలు అందిస్తుండగా, మరికొన్ని బ్యాంకులు వెనుకంజలో ఉండిపోతున్నాయని అన్నారు. క్రమం తప్పకుండా సమీక్ష జరుపుతూ, శత శాతం లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం వర్తింపజేసిన రుణమాఫీ ద్వారా అర్హులైన ప్రతి రైతు లబ్ది పొందేలా చూడాలన్నారు. వ్యవసాయ శాఖతో పాటు ఇతర పశు సంవర్ధక, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర శాఖలతో సమన్వయము చేసుకుని ప్రభుత్వ పథకాల కింద ఎంపికైన లబ్దిదారులకు సకాలంలో రుణాలు అందించి స్వయం ఉపాధికి చేయూతనివ్వాలని హితవు పలికారు. రుణాలు తీసుకున్న వారు యూనిట్లు స్థాపించారా లేదా అన్నది నిశితంగా పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. తదుపరి సమావేశం నాటికి పరిస్థితిలో స్పష్టమైన మార్పు కనిపించాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు పూర్తి స్థాయిలో లింకేజీ రుణాలు పంపిణీ చేయాలని, సబ్సిడీ రుణాల పంపిణీలో జాప్యం చేయవద్దని సూచించారు. వీధి వ్యాపారులకు విరివిగా ముద్ర రుణాలతో పాటు స్టాండ్ అప్ ఇండియా కింద రుణాలు అందించాలన్నారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో అందిస్తున్న శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న అర్హులైన అభ్యర్థులకు యూనిట్ల స్థాపన కోసం రుణాలు అందించేందుకు బ్యాంకర్లు చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో ఆర్.బి.ఐ ఏజీఎం పృథ్వీ, డీఆర్డీఓ సాయాగౌడ్, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ అశోక్ చవాన్, నాబార్డు ఏజీఎం ప్రవీణ్ కుమార్, మెప్మా పీ.డీ రాజేందర్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అంకిత్

షాపింగ్‌మాల్స్‌లో బతుకమ్మ, దసరా కొనుగోళ్ల సందడి

- ప్రత్యేక డిస్కౌంట్‌లు :

ఆనంద్‌షాపింగ్‌మాల్ యాజమాన్యం

నవతెలంగాణ-ఆర్మూర్

పండుగల నేపథ్యంలో షాపింగ్‌మాల్స్ కొనుగోలుదారులతో కిక్కిరిస్తు న్నాయి. బతుకమ్మ, దసరా నేపథ్యంలో పెద్దఎత్తున కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే తమ షోరూంలో ప్రత్యేక ఆఫర్‌లు ఉన్నట్టు ఆనంద్‌షాపింగ్ మాల్ యాజమాన్యం పేర్కొంటుంది. పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద 9 సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకొని పదవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో నాణ్యతతో పాటు తక్కువ ధరలకు దుస్తులను అందిస్తున్నట్టు మాల్ యజమానులు తెలిపారు. ఈ షాపింగ్ మాల్‌లో వినియోగ దారులకు కావలసిన నాణ్యత, ముఖ్యంగా మహిళలకు, పిల్లలకు కావలసిన దుస్తులను అందిస్తున్నట్టు చెప్పారు.



44 సంవత్సరాల క్రితం నుండి

కరీంనగర్ జిల్లా కోరుట్ల పట్టణానికి చెందిన చింతకింది రాజగంగారం కుమారులు 44 సంవత్సరాల క్రితం షాపింగ్ మాల్ ఏర్పాటు చేసి, వివిధ పట్టణాలకు విస్తరింప చేశారు. పట్టుదలే పెట్టుబడిగా ఉత్తర తెలంగాణలోని పలుచోట్ల షాపింగ్ మాల్స్ ఏర్పాటు చేసిన చింతకింది హరికుమార్ నేడు ఎందరికో ఆదర్శప్రాయంగా నిలిచారు.

సువిశాల భవనంలో..

చింత కింది రావిష్. ఆనంద్‌షాపింగ్‌మాల్



ప్రజల నమ్మకానికి ప్రమాణికంగా అతి తక్కువ లావాపేక్షతో, ప్రశాంత వాతావరణంలో సువిశాలమైన భవనంలో షాపింగ్ మాల్ ముందుకు దూసుకెళ్తుంది.మా షాపింగ్ మాల్‌కు వచ్చే కస్టమర్లే మా దేవుళ్ళు.

ప్రత్యేక డిస్కౌంట్లతో

చింతకింది రిషికేష్.



దసరా దీపావళి షాపింగ్‌లపై ప్రత్యేక డిస్కౌంట్‌తో విలువైన బహుమతులను సైతం అందజేస్తున్నాం. వినియోగదారులకు దసరా, దీపావళి శుభాకాంక్షలు

దుర్గామాతలవద్ద అన్నదానాలు



కంఠేశ్వర్: అన్నదానంలో పాల్గొన్న భక్తులు

నవతెలంగాణ-కంఠేశ్వర్/జక్రాన్‌పల్లి

శ్రీ దుర్గా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా ఖానాపూర్ గ్రామం డివిజన్ నెంబర్-1లో యువ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ.. యువ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో యువ యుత్ సభ్యులు రమేష్, మహేంధర్, కోర్వ ఆదీష్, సందీప్, సాయి కూమార్, గంగా మహిపాల్, రాజు, అనూప్, దుర్గామాత కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో శ్రీ దుర్గా దేవి సేవా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం బుధవారం నిర్వహించారు.

జక్రాన్‌పల్లి మండలంలోని చింతలూరు గ్రామంలో దుర్గామాత దగ్గర ముదిరాజ్ యూత్ ఆధ్వర్యంలో హెూమం, అన్నదానం చేసినట్టు కొలిప్యాక్ సింగిల్ విండో చైర్మన్ నాగుల శ్రీనివాస్ తెలిపారు. స్వాములు, మహిళలు, గ్రామస్తులు, ముదిరాజ్ సంఘసభ్యులు పాల్గొన్నారు.

దసరా, దేవి నవరాత్రులకు ప్రత్యేక స్థానం : ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నగరంలో పలు డివిజన్లలో దేవి మండపం నిర్వాహకులు నిర్వహించిన అన్నదానం, పూజ కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణాలో దసరా, దేవి నవరాత్రులకు ప్రతేక స్థానం ఉందన్నారు చెడుపై సాధించిన విజయానికి గుర్తుగా దసరా నిర్వహిస్తారన్నారు. ఒక్కో రోజు, ఒక్కో రూపంలో అమ్మవారిని అలంకరించి పూజిస్తారని తెలిపారు. అమ్మ ఆశీర్వాదంతో జిల్లా ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. అనంతరం వివిధ డివిజన్లో ఏర్పాటు చేసిన అన్నదానాలలో పాల్గొని వడ్డించారు. కార్యక్రమంలో అమ్మ వారి మండపం నిర్వాహకులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



విజేత నాగంపేట్ జట్టు

నవతెలంగాణ-ముప్కాల్

నాలుగు రోజులుగా మండల కేంద్రంలో కొనసాగుతున్న క్రికెట్ పోటీలు బుధవారం ముగిసినట్లు క్రికెట్ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కబడ్డీ జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. మొత్తం 25 జట్లు పాల్గొనగా నాగంపేట జట్టు విజేతగా నిలిచిందని అన్నారు. విజేతకు రూ.10 వేల నగదుతో పాటు షీల్డ్‌ను, రన్నర్ గా నిలిచిన బాల్కొండ జట్టుకు రూ.5 వేల రూపాయలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, మాసం గోపి, రెడ్డీస్ యూత్ సభ్యులు లోక సుభాష్, ప్రశాంత్ రెడ్డి, ముస్కు శ్రీను, ముజ్జు తదితరులు పాల్గొన్నారు..

గల్ఫ్‌లో కల్లివిల్లి కార్మికులను ఆదుకోవాలి

పవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక నాయకులు కోటపాటి నరసింహ నాయుడు

నవతెలంగాణ-ఆర్మూర్

గల్ఫ్‌లో కలివిల్లి కార్మికులను ఆదుకోవాలని ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక నాయకులు కోటపాటి నరసింహ నాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జీఓ 205 ద్వారా ఏడు గల్ఫ్ దేశాల కార్మికుల సంక్షేమం కోసం చనిపోతే ఐదు లక్షల నష్టపరిహారం, వారి పిల్లలకు రెసిడెన్షియల్ స్కూల్స్‌లో అడ్మిషన్లు తదితర సౌకర్యాలు కల్పిస్తామని చెప్పిందన్నారు. దానికి కొనసాగింపుగా గల్ఫ్ లో చనిపోయిన వారికి 5 లక్షల ఎక్స్ గ్రేషియా కోసం మార్గదర్శకాలు పొందుపరిచి మొన్నటి రోజున జీవో ఎంఎస్ నంబర్ 206 విడుదల చేశారని తెలిపారు. దాని ప్రకారం గల్ఫ్ లో పనిచేస్తూ చనిపోయిన వారికి సంబంధించి అక్కడి మరణ ధ్రువీకరణ పత్రం, కంపెనీలో పనిచేసిన వివరాలు, వీసా కాపీలు సమర్పించాలని నిబంధన విధించారని అన్నారు. ఈ నిబంధన కారణంగా గల్ఫ్ దేశాలలో 25శాతం పైగా కల్లివిల్లి(ఇల్లీగల్ గా కూలి పని చేసే వారు) కార్మికులకు వర్తించదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇక్కడి ఏజంట్ల మాటలు నమ్మి అక్కడికి వెళ్లాక కంపెనీ ఉద్యోగం లేక పోతే కల్లివిల్లిగా జీవిస్తూ రోజువారి కూలీల మీద ఆధారపడి బతికే కార్మికుడు దురదృష్టవశాత్తు మరణిస్తే నష్టపరిహారం ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. గల్ఫ్ లోని ఏడు దేశాలు కాక ఇంకా అనేక ఇతర దేశాల్లో పని కోసం వెళ్లిన వారికి వర్తించే విధంగా జీవో 205, 206ను సవరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సమగ్ర ఎస్ఆర్ఐ పాలసీ, గల్ఫ్, ఇతర విదేశాల కార్మికుల సంక్షేమం బోర్డు" ను చట్టబద్ధంగా ఏర్పాటు చేయాలన్నారు. వెయ్యికోట్లు రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది ఊరే బాలయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోటపాటి

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
5
గురువారం అక్టోబర్ 10, 2024 www.navatelangana.com

బతుకమ్మ వేడుకలు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని డోంగ్లి మండలం అంగన్వాడి ఆధ్వర్యంలో బుధవారం బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. డోంగ్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బతుకమ్మ పండుగను తహసిల్దార్ రేణుక చౌహన్, ఐసిడిఎస్ సిడిపిఓ కళావతి రాథోడ్ ఆధ్వర్యంలో డోంగ్లి మండలంలోని అంగన్వాడి సెంటర్ల టీచర్లు ఆయాలు పాల్గొని బతుకమ్మ పండుగ సంబరాలు ఆనందంగా నిర్వహించారు.


బతుకమ్మను ఎత్తుకున్న తహసీల్దార్, సీడీపీవో

ఇసుక ట్రాక్టర్ పట్టుకున్న ఆర్టీవో అధికారులు

- 'ఎవరైతే మాకేంటి' కథనానికి స్పందన

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలం మందర్న సమీపంలోని మంజీర నదిలో నుంచి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను బోధన్ ఆర్టీవో అధికారి శ్రీనివాస్ కొప్పర్తిక్యాంప్ వద్ద బుధవారం పట్టుకున్నారు. పట్టుబడిన ఇసుక ట్రాక్టర్‌ను ఆర్టీఓ కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేసి జరిమానా విధించినట్టు ఆయన తెలిపారు. అయినా ఇసుక అక్రమదారులు అధికారుల కళ్లుగప్పి అక్రమంగా ఇసుక తరలిస్తూనే ఉన్నారు. జిల్లా కలెక్టర్ రెవెన్యూ, ఆర్టీఓ, పోలీసుల సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేసి అక్రమ ఇసుక రవాణాను పకడ్బందీగా అరికట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


అధికారులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా కృషి చేయాలి

- జిల్లా ఎస్పి సింధుశర్మ
- రాజంపేట్ పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-కామారెడ్డి

పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు తక్షణ న్యాయం అందించేలా కృషి చేయాలని పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ సింధుశర్మ సూచించారు. బుధవారం రాజంపేట్ పోలీస్‌స్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి సిబ్బంది పనితీరు గురించి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్లో నమోదైన కేసుల వివరాలను తెలుసుకొని, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా భరోసా కల్పించాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పోలీస్‌స్టేషన్‌లో పెట్రోల్ కార్, బ్లూ కోట్ సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించాలని, 100 డయల్ వస్తే తక్షణమే స్పందించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ అధికారులు, పోలీస్ ఆఫీసర్స్ తమకు కేటాయించిన గ్రామాలలో విధిగా పర్యటించాలని ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని సూచించారు. ప్రజలకు సైబర్ నేరాల పట్ల, సైబర్ నేరగాల్లు చేసే మోసాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పరచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి డిఎస్పీ నాగేశ్వర్‌రావు, భిక్నూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంపత్ కుమార్, ఎస్సై పుష్ప రాజ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ సింధుశర్మ

పోలీసు కానిస్టేబుల్ దర్పల్లి రామన్ మరణానికి సంతాపం..

పోలీస్ కానిస్టేబుల్ ధర్పల్లి రామన్ అకాల మరణానికి జిల్లా ఎస్పీ సింధు శర్మ సంతాపం వ్యక్తం చేశారు.

అంత్యక్రియల నిమిత్తం జిల్లా పోలీసు శాఖ తరపున రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. 1992లో పోలీసు శాఖలో నియామకమై జిల్లా పోలీసు శాఖకు ఎనలేని సేవలను అందించారని, రామన్ మరణం వారి కుటుంబానికే కాకుండా జిల్లా పోలీసు శాఖకు తీరని లోటని అన్నారు. రామన్, పి.సి. 1512, మాచారెడ్డి పోలీస్ స్టేషన్ నందు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ గత కొంత కాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతూ బుధవారం ఉదయం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో మృతిచెందాడని తెలిపారు. పోలీస్‌శాఖ తరపున రామన్ కుటుంబానికి రావలసిన అన్ని బెనిఫిట్స్ సకాలంలో అందే విధంగా చూస్తామని, పోలీస్‌శాఖ ఎల్లవేళలా వారి కుటుంబానికి అండగా ఉంటుందని అన్నారు.

బాన్సువాడ డివిజన్‌లో తాగునీటి ఎద్దడి

- సింగూర్ పైప్‌లైన్ లీకేజీ.. ట్రాక్టర్ ద్వారా సరఫరా

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

బాన్సువాడ డివిజన్ పరిధి గ్రామాలకు తాగునీరు అందించడం కోసం ఏర్పాటు చేసిన సింగూరు పైపులైను లీకేజ్ కారణంతో గత రెండు రోజులుగా బాన్సువాడ డివిజన్ పరిధిలోని బీర్కూర్, నసురుల్లాబాద్, బాన్సువాడ మండలలోని వివిధ గ్రామాల్లో నీటి కష్టాలు అప్పుడే మొదలయ్యాయి. ఎండలు ముదరక ముందే నీటి కష్టాలు ఇలా ఉంటే రాబోయే రోజుల్లో ఇంకెలా ఉంటుందో అని స్థానిక ప్రజలు వాపోతున్నారు. సింగూరు తాగునీటి పైపు లైన్ చాలా చోట్ల లీకేజీ కావడంతో తాగునీటి సమస్యలు తీవ్రంగా ఏర్పడుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీర్కూరు మండలంలోని కిష్టాపూర్ గ్రామాల్లో నేడు గ్రామ పంచాయతీకి చెందిన తాగునీటి ట్యాంకర్‌తో ప్రజలకు తాగునీరు అందించారు. బీర్కూర్ మండలంలోని పలు గ్రామాలలో గత మూడు రోజుల నుండి తాగునీరు నీటి కొరత ఏర్పడడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఉమ్మడి మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండగపూట నీళ్ల రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ ట్యాంకర్‌తో నీటిని సప్లై చేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు.


ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా


సోయాబీన్ కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-పొతంగల్

మండలంలోని హెగ్డోలిలో విశాల సహకార సంఘం, పోతంగల్ ఆధ్వర్యంలో సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ బుధవారం ప్రారంభించారు. ఆ సందర్భంగా అతను మాట్లాడుతూ.. దళారులతో మోసపోవద్దని, ప్రభుత్వం క్వింటాకు రూ.4,892 మద్దతు ధర ఇస్తోందన్నారు. విండో చైర్మన్ శాంతేశ్వర్ పటేల్, కోటగిరి మార్కెట్ కమిటీ ఛైర్మన్ హనుమంతు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పుప్పాల శంకర్, జెడ్పీ కో-ఆప్షన్ మెంబర్ సిరాజుద్దీన్, ఏవో శ్రీనివాస్‌రావు, రైతులు పాల్గొన్నారు.

అడ్లూర్ వాసికి స్కూల్ అసిస్టెంట్ పోస్టు

నవతెలంగాణ-సదాశివనగర్



కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన జె.అరవింద్ సాంఘీక శాస్త్రంలో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సంపాదించినట్లు తెలిపారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామకపత్రం పొందినట్లు తెలిపారు. తండ్రి వీరమ హేందర్ ఎస్జిటిలో ఉద్యోగం సంపాదిస్తే.. తనయుడు సాంఘిక శాస్త్రంలో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సంపాదించారు. స్నేహితులు, గ్రామ ప్రజలు ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

బతుకమ్మ పండుగ కోసం ఏర్పాట్లు చేయాలి

నవతెలంగాణ-దోమకొండ

బతుకమ్మ పండగ కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని అంబరిపేట్, సంగమేశ్వర్ గ్రామ పంచాయతీల్లో ప్లాంటేషన్‌ను, పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించి, ఎరువులు తయారు చేయాలని సూచించారు. సద్దుల బతుకమ్మ పండగ సందర్భంగా చెరువుల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పద్మ, సిబ్బంది ఉన్నారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-కామారెడ్డి

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో కామారెడ్డి కలెక్టర్ ఏవోకు బుధవారం వికలాంగుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు చిప్ప దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గాడి నర్సింలు, నితీష్‌రెడ్డి, బంజ రాజు, బంటు స్వామి, పోచయ్య, మల్లయ్య, రంగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి ట్రస్ట్ బోధన్ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులుగా గంగాధర్ రావు పట్వారీ గెలుపు

- అసలైన ఎన్నికలను తలపించిన కమిటీ ఎన్నిక ప్రక్రియ
- తొలిసారిగా ఓటింగ్ ద్వారా కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని శ్రీ మహాలక్ష్మి ట్రస్ట్ బోధన్ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులుగా గంగాధర్‌రావు పట్వారీ ఎన్నికలలో గెలుపొందారు. బుధవారం 28 కుల సంఘాలలోని వారితో జరిగిన ఎన్నికల్లో గంగాధర్ రావు పట్వారీ తన ప్రత్యర్థి రుద్ర సత్యనారాయణపై విజయం సాధించారు. రుద్ర సత్యనారా యణకు 29 ఓట్లు, గంగాధర్ పట్వారీకి 35 ఓట్లు పోలయ్యాయి. ఒక ఓటు చెల్లలేదు. ఉపాధ్యక్షులుగా సూర లింగం, ఉద్మీర్ సాయిలు, ప్రధాన కార్యదర్శిగా బీర్కూర్ శంకర్, కార్యదర్శిగా ఈరపురం చిన్న పోశెట్టి, దండు సంగ్రాం, కోశాధి కారిగా గమరపేట శ్రీనివాస్, సభ్యులుగా చిలుక రాములు, ఒంటిజడ భూమయ్య, సున్నం గంగాధర్, సిద్దిపేట సురేష్, బోదు శేఖర్, బుర్క లింగాగౌడ్, ఎంబెల్లి గంగారాం, ఎల్.చిన్నపర్వయ్య సభ్యులుగా ఎన్నికలలో విజయం సాధిం చారు. ఉదయం ప్రారంభమైన ఎన్నికల సరళి మధ్యాహ్నం వరకు కొనసాగింది. అనంతరం మధ్యాహ్నం నుంచి ప్రారంభమైన ఓట్ల లెక్కింపు రెండు గంటలలో ముగిసి ఫలితాలు వెల్లడించారు. ఎన్నికల అధికారులుగా పోశెట్టి, ఎంబెల్లి శంకర్ వ్యవహరించారు.


ఎన్నికలలో గెలుపొందిన గంగాధర్ రావు పట్వారీ

తొలిసారిగా ఓటింగ్ ద్వారా కమిటీ ఎన్నిక...

ఎన్నో సంవత్సరాల నుంచి బోధన్ గ్రామాభివృద్ధి పేరుతో కొనసాగిన కమిటీ ఈసారి ఓటింగ్ ద్వారా తొలిసారిగా కమిటీని, సభ్యులను ఆయా కుల సంఘాల నాయకులు ఎన్నుకున్నారు. 28 కుల సంఘాల ఓటర్లతో జరిగిన ఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపించాయి. గత కమిటీపై అవినీతి ఆరోపణలు రావడంతో ఈ సారి నూతన కమిటీ ఏర్పాటుకు తీవ్ర పోటీ ఏర్పడింది. దాంతో కుల సంఘాల నాయకుల మధ్య సయోధ్య కుదరకపోవడంతో చివరికి ఎన్నికలు నిర్వహించవలసి వచ్చింది. రాజకీయంగా ఎంతో అనుభవమున్న మాజీ డీసీసీబీ చైర్మెన్ ఈ కమిటీ అధ్యక్ష పదవికి పోటీపడి విజయం సాధించారు. ఎన్నికలు ఎప్పుడు జరిగిన బోధన్ రాజకీయాలలో బోధన్ గ్రామాభివృద్ధి కమిటీదే కీలకపాత్ర ఉంటుందని అందరూ భావిస్తారు. ఈ సందర్భంగా గంగాధర్ రావు పట్వారీ తనను గెలిపించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

మేమెంతో మాకు అంత

- విద్య ఉద్యోగాలలో జనాభా ఆధారంగా రిజర్వేషన్లు అమలు చేయాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు

నవతెలంగాణ-కామారెడ్డి

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు తీరుపై కామారెడ్డి జిల్లా కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర కార్యదర్శి జీవీఎం విట్టల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అగ్రవర్ణ పేదలకు మాత్రమే అమలు చేయాలన్నారు. కానీ 6 శాతం ఉన్న అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు ఏ ప్రాతిపదికంగా అమలు చేస్తున్నారో ప్రభుత్వాలు ప్రకటించాలని, గత కొన్ని సంవత్సరాలు బిసి సమగ్ర కుల గణన చేసి రిజర్వేషన్ అమలు చేయాలని ఉద్యమాలు చేస్తుంటే అగ్రవర్ణ పేదలు ఐదు శాతం ఉన్న వాళ్లకి 10 శాతం రిజర్వేషన్లు ఎలా అమలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశ, రాష్ట్ర వ్యాప్తంగా బీసీ జనాభా 55 శాతం కన్నా ఎక్కువగా ఉంటే వారికి అమలు చేయాల్సిన రిజర్వేషన్లు అమలు చేయకుండా 27 శాతాన్ని అమలు చేసి బిసి కులాలకు సరైన న్యాయం చేయకుండా ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని అన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ వల్ల కానిస్టేబుల్, డీఎస్సీ, ఎంబిబిఎస్ తదితర జాబుల్లో బీసీ విద్యార్థులు చాలా నష్టపో యారన్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి బీసీల రిజర్వేషన్ అమలు చేయాలని చెప్పవలసిన వారు బీసీలకు వచ్చే రిజర్వేషన్లలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు చేయాలని కోర్టులో కేసు వేయడం తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఓట్లతో గెలిచిన మీరు వారికి ద్రోహం చేస్తున్నారని హెచ్చరిం చారు. బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తుంటే బీసీల రిజర్వేషన్లను గండి కొట్టాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని అన్నారు. ఆనాడు మండల్ కమిషన్ ప్రతిపాదనలు అమలు చేయ కుండా ఉండడం వల్లనే బీసీలు విద్య, వైద్యం, ఉపాధికి, రాజకీయాలకు దూరం అయ్యేలా చేస్తున్నారన్నారు. ప్రభుత్వాలు ఇప్పుడైనా ఆలోచించి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌పై స్పష్టత ఇవ్వాలన్నారు. దీనిపై అన్ని బహుజన సంఘాలను కలుపుకొని కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల బాబు, బామ్ సేఫ్ రాష్ట్ర కార్యదర్శి దుబాయ్ నరేందర్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొంగలి వెంకటి, జిల్లా అధ్యక్షులు యాదన్న, బహుజన ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ క్యాతం సిద్ధిరాములు, జేఏసీ కన్వీనర్ జగన్నాథం, అంబేద్కర్ యువ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి గంగారం, అంబేద్కర్ సంఘం గౌరవ అధ్యక్షులు కొత్తపల్లి మల్లన్న, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు శివరాములు, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు భూమన్న, ధర్మ సమాజ పార్టీ జిల్లా కన్వీనర్ బోలేష్, అరవింద్, డిటియు జిల్లా అధ్యక్షులు అశోక్, శంకర్, రజక సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ రాజయ్య, భోగిడే సాయిలు, సురేందర్, సంగయ్య, లక్ష్మణ్, అర్బస్ ఖాన్, బబ్లు తదితరులు పాల్గొన్నారు.


రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న పలువురు

కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు

దుర్గామాత మండపాల వద్ద అన్నదానం

నవతెలంగాణ-విలేకరుల బృందం

బోధన్ : మండలంలోని పెగాడపల్లి గ్రామంలో శ్రీదేవి నవరాత్రుల సందర్భంగా దుర్గామాత మండపం వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించి, తదనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. నవరాత్రుల సందర్భంగా ఏడవ రోజు సరస్వతి అలంకరణ రూపంలో పూజా కార్యక్రమం నిర్వహించారు. దుర్గామాత కమిటీ నిర్వాహకులు బదూరి లింగారెడ్డి, గుండారం సతీష్, కారడి సాయిబాబా, మేడి రవి, గోంటి రాజు, గుండారం యోగేష్, దేవరాజ్, బైరాగి కిషన్, టేకుల రవి, టేకుల వెంకటేష్, గోవింద్, గంగాధర్, సార్గం రంజిత్‌రెడ్డి, యోగేష్, సాయిలు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మహా అన్న ప్రసాదం..

మద్నూర్ : మండల కేంద్రంలోని గాంధీచౌక్ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద గ్రామస్తులు కలిసి పెద్దఎత్తున మహా అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్న ప్రసాద కార్యక్రమంలో దుర్గమాత విగ్రహ ప్రతిష్టాపన మండపం నిర్వాహకుల సభ్యులు పాల్గొన్నారు.

దుర్గామాత మండపాన్ని సందర్శించిన నాందేడ్ మాజీ ఎమ్మెల్యే..

మద్నూర్ మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో స్థాపించిన దుర్గామాత మండపాన్ని మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కేంద్రానికి చెందిన మాజీ ఎమ్మెల్యే ఓం ప్రకాష్ పోకరణ సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి దుర్గామాత ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా మండప నిర్వాహకులు డాక్టర్ బండివార్ విజయ్ శాలువాతో ఘనంగా సత్కరించారు. మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలో పాల్గొన్నందుకు డాక్టర్ మాజీ ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

దుర్గామాత మండపాల వద్ద అన్నదానం..

భిక్కనూర్ : పట్టణ కేంద్రంలోని అంగడి బజారులో మాజీ సర్పంచ్ తునికి వేణు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గామాత అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణంలోని ప్రజలు, ప్రజా ప్రతినిధులు, ఇతర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

దుర్గమాత మండపం నిర్వాహకులకు రూ.5వేలు విరాళం..

ఎడపల్లి : మండలంలోని కుర్నాపల్లి గ్రామంలోని దుర్గమాత మండపం నిర్వాహకులకు దేవి దూప దీపా నైవేద్యంతో పాటు, అన్నప్రసాద కార్యక్రమాల ఖర్చుల నిమిత్తం మండపాల నిర్వాహకులకు ఎడపల్లి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు కందగట్ల రామచందర్, నగదు రూ.5వేలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ ఎడపల్లి మండల అధ్యక్షులు కోల ఇంద్ర కరణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లెపూలు శ్రీనివాస్, నాయకులు కంటెడి గంగాధర్, కుర్నాపల్లి నాయకులు గంగాధర్, గణేష్, శ్రీకాంత్, నారాయణ సింగ్, రాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

దేవి శరన్నవరాత్రులలో భక్తి కీర్తనలు..

పొతంగల్ : మండలంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా దుర్గమాత పూజలు, అర్చనలే కాక, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అఖండ హరినామ సప్త కార్యక్రమంలో భాగంగా పరమేశ్వర్ మహారాజ్, భజన్ సామ్రాట్ సంతోష్ మహారాజ్, వికాస్ మహారాజ్, జ్ఞానేశ్వర్ మహారాజ్, హరిదాసు మహారాజ్, రాకేష్ మహారాజ్, దిగంబర మహారాజ్, తుకారాం మహారాజ్ లు పాల్గొన్నారు.


నాగిరెడ్డిపేట్ : పూజలో పాల్గొన్న మహిళలు

దుర్గమాతకు కుంకుమార్చన

సదాశివనగర్ : మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలోని గ్రామ రైతు యువజన సంఘం దుర్గమాతకు బుధవారం కుంకుమార్చన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 75 మంది మహిళలు తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత వద్ద ప్రత్యేక పూజలు..

నాగిరెడ్డిపేట్ : మండలంలోని కిచన్నపేట్, అక్కంపల్లి గ్రామల్లో దుర్గామాత మండపం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుంకుమార్చన, సప్తశతి చండీయాగం అంగరంగ వైభవంగా వేద పండితులతో నిర్వహించారు. ఈ సందర్భంగా పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

జప్తి జాన్కంపల్లిలో గణపతి హెూమం..

మండలంలోని జప్తి జానకంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గామాత వద్ద భక్తులు గణపతి హెూమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు వేదమంత్రాలతో గణపతి హెూమం, పుణ్యావాచనం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-బోధన్

మండలంలోని పెంటాఖర్దు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999-2000 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల అపూర్వ కలయికను సాలూర మండలం కొప్పర్తిక్యాంప్‌లోని కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించారు. 1999-2000 పూర్వ విద్యార్థులు వారి కుటుంబాల సభ్యులు సతీసమేతంగా ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు తమకు విద్య నేర్పిన గురువులను ముఖ్య అతిథిగా ఆహ్వానించి శాలువా పూలమాలలు, మెమోంటోలతో ఘనంగా సత్కరించారు. ప్రముఖ మెజీషియన్ యుగేందర్ చేత ప్రత్యేక మ్యాజిక్ షో నిర్వహించారు. ఎప్పుడో కలిసిమెలిసి చదువుకున్న స్నేహితులు ఇలా కలవడంతో ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యయులు శ్రీనివాస్‌రావు, దుర్గారావు, రామారాజు, బాల త్రిపురా దేవి, పూర్వ విద్యార్థుల సమ్మేళనం కోఆర్డినేటర్లు భాస్కర్, విఠలేశ్వర్, రామకృష్ణ, నారాయణ, జ్యోతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

పూలకు, బతుకమ్మలకు భలే గిరాకీ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజివాడి చౌరస్తాలో బంతి పూలకు, కాగితపు బతకమ్మలకు బుధవారం భలే డిమాండ్ పెరిగింది. బతుకమ్మ పండుగ నేపథ్యంలో బంతి పూలకు కిలో రూ.150 ధర పలికింది. కాగితపు బతుకమ్మను సైతం వ్యాపారులు రూ.150కి విక్రయించారు.



నాగన్నగారి బావిని సందర్శించిన కేంద్ర బృందం

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని నాగన్నగారి దిగుడు బావిని కేంద్ర బృందం సభ్యులు బెంజమిన్ కరుణాకరన్, డిప్యూటీ కమిషనర్, మినిస్ట్రీ ఆఫ్ పవర్ డిపార్ట్మెంట్, ఏఎస్ పవార్ సైంటిస్ట్ కేంద్ర భూగర్భశాఖ అధికారుల బుధవారం సందర్శించారు. కామారెడ్డి జిల్లాలో భూగర్భ జలాలు పెంచేందుకు చేపడుతున్న పనులను సందర్శించేందుకు వచ్చిన నేపథ్యంలో భాగంగా లింగంపేట్‌లో గల నాగన్నగారి బావిని సందర్శించి పురాతన బావిని పునర్ నిర్మించిన తీరును చూసి ముగ్ధులయ్యారు. అంతర్ భూభాగంలో ఐదు అంతస్తులు నిర్మాణం చేపట్టిన చారిత్రక కట్టడమన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ సురేందర్, ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరి తదితరులు పాల్గొన్నారు.